

నమ్మించి ముంచేస్తున్నారు..!

- ఉద్యోగాల పేరిట రూ.లక్షల్లో వసూళ్లు
- నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం
- ఆశకి పోయి.. నష్టపోతున్న యువత
- డబ్బులతో ఉడాయిస్తున్న మోసగాళ్లు

జిల్లాలో ఉన్నత చదువులు చదివిన యువతకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు తగ్గిపోయాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి చోట్ల ప్రత్యేక శిక్షణ పొందితే తప్ప సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలు రావడం లేదు. కరోనా విపత్తు తర్వాత ఈ సమస్య మరింత జటిలమైంది. అంతేకాకుండా వ్యవసాయం, చిరు వ్యాపారం, ఇతర రంగాల్లో ఉపాధి పొందే యువకులకు పెళ్లి సంబంధాలు కుదరడం లేదు. దీంతో పక్కదారి పట్టి అయినా ఉద్యోగం సంపాదిస్తే తప్ప ఇబ్బందులు తీరవనే భావనలో కొందరు నిరుద్యోగులు పక్కదారి పడుతున్నారు. దీంతో నిరుద్యోగులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుని మోసపోతున్నారు. నిరుద్యోగుల అవసరాలను కొందరు దళారులు, మోసగాళ్లు, రాజకీయ నాయకులు తమకు ఆదాయ వనరుగా మార్చుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో కొందరు నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇందుకోసం ముందుగానే నగదును తీసుకుని నిండా ముంచేస్తున్నారు. ఉపాధి, ఉద్యోగాల పేరిట మాయగాళ్ల వలలో నంద్యాల యువత చిక్కి బలవుతోంది.



నంద్యాల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కొందరు మోసగాళ్లు బరితెగించారు. కొందరు ఆన్‌లైన్ ఫేస్‌బుక్, వాట్సప్ తదితర రూపాల్లో సోషల్ మీడియాలో పరిచయం చేసుకుని మరింత సన్నిహిత్యం పెంచుకోవడం. తరచూ ఫోన్‌లో సంభాషించడం జరుగుతోంది. అదే చొరవతో ఫోన్ నెంబర్ తీసుకుని మాయమాటలతో నమ్మించి వారి విద్యార్హతకు తగ్గ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మిస్తూ డబ్బులు కాజేస్తున్నారు. కనీసం ముఖ పరిచయం కూడా లేకుండా కొందరు నిరుద్యోగులు లక్షలు చెల్లించి మోసపోతున్నారు. బంధువుల ద్వారా పరిచయం కలిగిన వ్యక్తులు ఉద్యోగాలు ఇప్పిస్తామని టోకరా వేయడం మరింత కలవరపెడుతోంది. ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కొంత పలుకుబడి ఉన్నవాళ్లు ఇలాంటి నేరాలకు పాల్పడటం కలకలం రేపుతోంది. మరీ దారుణంగా ఓ వైద్యుడు సైతం తమ కింద పనిచేస్తున్న ఓ మహిళ కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేయడంతో చివరికి పోలీసులు సదరు వైద్యుడిపై కేసు నమోదు చేయడం గమనార్హం. ఈ తరహా చీటింగ్ వ్యవహారాలు నంద్యాల జిల్లాలో ఇటీవల కాలంలో అధికమయ్యాయి.

వందల సంఖ్యలో బాధితులు

జిల్లాలో వివిధ ఉద్యోగాల పేరుతో మోసగాళ్ల నుంచి మోసపోయిన బాధితుల సంఖ్య వందల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ఈ తరహా కేసులు అధికంగా వెలుగులోకి వస్తుండటమే ఇందుకు నిదర్శనం. బాధితులు కూడా ఏమాత్రం ఆలోచన చేయకుండా ఉద్యోగం అనే ఆశతో అప్పులు చేసి మరీ లక్షల రూపాయలను కోల్పోతున్నారు. ఆశించిన స్థాయిలో ఉద్యోగాల భర్తీ లేకపోవడం.. ఉద్యోగాల పేరుతో మోసం చేసిన వారిపై పోలీసుల నిర్లక్ష్యం వైఖరితో జిల్లాలో దళారి వ్యవస్థ జోరుగా సాగుతోంది. ఇలాంటి మోసాలపై పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జిల్లాలో జరిగిన సంఘటనలు కొన్ని..

జిల్లా విద్యుత్‌శాఖలో గతంలో ఓ కాంట్రాక్టర్‌గా పనిచేసిన ఓ వ్యక్తి.. ఆపరేటర్, అటెండర్, క్లర్క్ తదితర ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురు నిరుద్యోగులను నమ్మించి వారి నుంచి రూ.కోట్లలో తీసుకున్నాడు. ఏళ్లు గడుస్తున్నా ఉద్యోగం మాత్రం ఇప్పించలేదు. కనీసం బాధితులు డబ్బులు వెనక్కి అడిగినా కూడా ఇవ్వడం లేదు. కేసుల పేరుతో బెదిరిస్తున్నారని కొందరు బాధితులు వాపోతున్నారు. కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన ఓ బాధితుడు సదరు కాంట్రాక్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 2019లో తమ కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి తమ నుంచి రూ.9 లక్షలు తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కర్నూలు జిల్లా కోడమూరు, ఎమ్మిగనూరు, ఆలూరు, నంద్యాల, కడప, ఆళ్లగడ్డలో బాధితులు అధికంగానే ఉన్నారు. రెండు రోజుల క్రితం కూడా సదరు కాంట్రాక్టర్ లోకేశ్వర కన్‌స్ట్రక్షన్ పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి.. నిరుద్యోగుల నుంచి లక్షల్లో వసూలు చేసి మోసం చేశారని ఓ సంఘం నాయకుడు జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈకి ఫిర్యాదు చేశారు. మొత్తంగా ఉద్యోగాల పేరుతో సుమారు రూ.2 కోట్లు వసూలు చేసి మోసం చేసినట్లు తెలుస్తోంది. అదే కాంట్రాక్టర్ కర్నూలుకు చెందిన సమీప బంధువు వద్ద కూడా ఓ వర్క్ విషయంలో 2021లో రూ.లక్షలు పెట్టుబడి పెట్టించి తిరిగి ఇవ్వలేదు.

- రెండేళ్ల క్రితం మహానంది మండలానికి చెందిన ఓ వ్యక్తి కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులతో సుమారు రూ.కోటికిపైగా వసూలు చేసినట్లు తెలిసింది. ఆ తర్వాత బాధితులు నిలదీస్తే 'విజయవాడకు మీ పని మీదనే వెళ్తున్నా' అని చెప్పి ఐపీ నోటీసులు పంపించాడు. నిరుద్యోగులతో పాటు ఓ కానిస్టేబుల్ కూడా ఇతడి బాధితుడే. ఐపీ పెట్టిన తర్వాత ఆ వ్యక్తి నంద్యాలలో దర్జాగా తిరుగుతున్నట్లు సమాచారం.
- నంద్యాల పద్మావతి నగరంలోని ఓ వ్యక్తి ఆఫీస్ పెట్టుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పిస్తానని నిరుద్యోగుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేసి ఇటీవలే పరారయ్యాడు.
- బేతంచెర్లలో పనిచేస్తున్న ఓ వైద్యుడు 2023లో అక్కడే పనిచేస్తున్న ఓ నర్సు కుమారుడికి వైద్యశాఖలో అటెండర్ పోస్టు ఇప్పిస్తానని నమ్మించి రూ.5 లక్షలు తీసుకున్నాడు. ఏడాదైనా ఉద్యోగం ఇప్పించలేదు. దీంతో బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో 2024లో కేసులు నమోదు చేశారు.
- గోస్పాడు మండలానికి చెందిన ఓ వ్యక్తి కడప జిల్లా దువ్వూరుకు చెందిన ఓ వ్యక్తికి రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.లక్షల్లో డబ్బులు తీసుకుని ఉద్యోగం ఇప్పించకపోగా.. డబ్బు కూడా వెనక్కి ఇవ్వలేదు. ఈ ఘటనపై తాజాగా



పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.

- గత వైసీపీ హయాంలో డోన్ మండలానికి చెందిన ఓ రాజకీయ నాయకుడు అదే మండల పరిధిలోని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కుమారుడికి రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.16 లక్షలు తీసుకున్నారు. అయితే రెండేళ్లయినా ఉద్యోగం ఇప్పించకపోవడంతో బాధితులు నిలదీశారు. చివరికి డోన్ పట్టణ పోలీసులను బాధితులు ఆశ్రయించడంతో ఏడాది కిందట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం బాధిత వ్యక్తి అనారోగ్యంతో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.
- నంద్యాలలో కొందరు వ్యక్తులు ఓ ప్రజాప్రతినిధి పేరు చెప్పి.. వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు తమకు కావాల్సిన చోటుకు బదిలీ చేయిస్తామని నమ్మబలికి రూ.లక్షల్లో వసూలు చేశారని బాధిత ఉద్యోగుల ద్వారా తెలిసింది. ఈ వ్యవహారం జరిగి కూడా నెలలు గడుస్తోంది. అయితే ప్రభుత్వం బదిలీల ప్రక్రియకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకపోవడంతో కథ అడ్డం తిరిగింది. బదిలీ ప్రక్రియ ఆగిపోయింది. ఈ నేపథ్యంలో బాధిత ఉద్యోగులకు.. ఆ వ్యక్తుల మధ్య కొంత వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. బదిలీ ప్రక్రియ రాగానే చెప్పిన విధంగా బదిలీ చేయిస్తామని హామీ ఇచ్చాడు.

నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ టీస్టాల్ నిర్వాహకుడు గతేడాది ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన సుమారు 40 మందికి రైల్వేలో ఆర్పీఎఫ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి సుమారు రూ.2కోట్లు వసూలు చేశాడు. ఆ తర్వాత బాధితులు గుర్తించి అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఆరు నెలల కిందట అక్కడి పోలీసులు బాధితులను నంద్యాల వన్‌టౌన్‌కు పంపించారు. దీంతో పోలీసులు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఈ చీటింగ్‌లో టీస్టాల్ నిర్వాహకుడితో పాటు నంద్యాలకు చెందిన మరో వ్యక్తి, బీహార్‌కు చెందిన ఇద్దరి పాత్ర ఉన్నట్లు తేలింది.



- పాణ్యంకు చెందిన ఓ వ్యక్తి అదే మండలానికి చెందిన ఇద్దరు, గడివేములకు చెందిన మరో ఇద్దరితో రైల్వే ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి రెండేళ్ల కిందట సుమారు రూ.20 లక్షలు తీసుకున్నారు. జరిగిన మోసంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా వారి డబ్బు వెనక్కి రాలేదు. అదేవిధంగా మరో రాజకీయ నాయకుడు సైతం ఉద్యోగాలు, ఇంటి స్థలాల పేరుతో రూ.లక్షల్లో వసూలు చేసినట్లు సమాచారం.

మోసం చేస్తే కఠిన చర్యలు



ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను ఎవరైనా మోసం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. బాధితులు కూడా ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం మాత్రమే బాగా చదివి ఉద్యోగం పొందాలి. మాయమాటలు చెప్పే వ్యక్తులను ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మకూడదు. నిరుద్యోగులు, వారి తల్లిదండ్రులు కూడా ఇలాంటి వాటికి ఆకర్షితులు కాకూడదు. ఇలాంటి తరహా మోసాలపై పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి మరింత నిఘా పెంచుతాం.

- డాక్టర్ కోయ ప్రవీణ్, డీఐజీ, కర్నూలు రేంజ్



విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు (ఫైల్)

విచారించి న్యాయం చేస్తాం

- ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ

నంద్యాల టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే సమస్యలపై విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. సోమవారం బొమ్మలసత్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్తిస్థాయిలో విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. నిర్ణిత గడువులోగా సమస్యలు పునరావృతం కాకుండా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫిర్యాదుల్లో సివిల్ తగాదాలు, కుటుంబ కలహాలు, అత్తింటి వేధింపులు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలు ఉన్నాయన్నారు. ఈ రోజు మొత్తం 110 ఫిర్యాదులు వచ్చాయన్నారు. దూర ప్రాంతాల నుంచి జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేనివారు స్థానికంగా ఉండే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు ఇవ్వాలని అన్నారు. వాటిని కూడా పరిగణలోకి తీసుకుని పరిష్కరిస్తామన్నారు.

రీ ఓపెన్ దరఖాస్తులను పరిష్కరించండి: కలెక్టర్

- పీజీఆర్ఎస్‌కు 200 దరఖాస్తులు

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రీ ఓపెన్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌కు 200 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 30,985 ప్రజాఫిర్యాదులను పరిష్కరించామని ఫిర్యాదుల పరిష్కారంపై అర్జీదారుల అభిప్రాయసేకరణ కూడా చేపట్టామన్నారు. రీ ఓపెన్ అయిన 59 దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పెండింగ్‌లో ఉన్న 1811 దరఖాస్తులకు విత్ న్ ఎస్ఎల్ఏలోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జేసీ విష్ణు చరణ్, డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.




ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

శ్రీశైలం డ్యాం భద్రతపై తక్షణ చర్యలు

- అవసరమైన యాక్షన్ ప్లాన్ తయారు చేయండి
- డ్యాం అధికారులను ఆదేశించిన ఎన్‌డీఎస్ఏ చైర్మన్ అనిల్ జైన్
- విజయవాడలో సమీక్షించిన నేషనల్ డ్యాం సేఫ్టీ బృందం

కర్నూలు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు భద్రతపై తక్షణ చర్యలు చేపట్టాలని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) చైర్మన్ అనిల్ జైన్ సూచించారు. అవసరమైన యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ప్రాజెక్టు ఇంజనీర్లను ఆదేశించారు. సోమవారం విజయవాడలో శ్రీశైలం సహా వివిధ ప్రాజెక్టులపై అనిల్ జైన్ సమీక్ష నిర్వహించారు. శ్రీశైలం ప్రాజెక్టు ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి ప్రాజెక్టుకు తీసుకోవాల్సిన భద్రత చర్యలు వివిధ ప్రతిపాదనలపై ఎన్‌డీఎస్ఏ చైర్మన్ అనిల్ జైన్‌కు వివరించారు. అదే క్రమంలో డ్యాం తక్షణ మరమ్మతులకు రూ.30-35 కోట్లు అవసరం ఉందని శ్రీరామచంద్రమూర్తి వివరించారు. తక్షణమే అసరమైన నిధులు ఇవ్వాలంటూ ఆర్థిక శాఖకు అనిల్ జైన్ సూచించినట్లు తెలిసింది. తెలుగు రాష్ట్రాల జీవనాడి శ్రీశైలం ప్రాజెక్టు 2009 వరదలకు భారీగా దెబ్బతిందని, భద్రత ప్రశ్నార్థకంగా ఉందంటూ ఇప్పటికే పలు నిపుణుల కమిటీలు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. డ్యాం స్పిల్‌వేలో 490 అడుగుల్లో ఉన్న గ్యాలరీలు కనిష్ఠ నీటి మట్టంలో 220 గ్యాలరీలలో లీకేజీ ఏర్పడుతుందని, పలు మరమ్మతులు చేపట్టాలని వీటిని మే 31లోగా పూర్తి చేయాలని గతంలోనే ఆదేశించినా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై ఎన్‌డీఎస్ఏ చైర్మన్ అనిల్ జైన్ అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.



నేడు డ్యాంను పరిశీలించనున్న అనిల్ జైన్

నేషనల్ డ్యాం సేఫ్టీ చైర్మన్ అనిల్ జైన్ మంగళవారం (నేడు) శ్రీశైలం డ్యాంను పరిశీలించనున్నారు. విజయవాడలో జరిగిన ప్రాజెక్టుల సమీక్ష అనంతరం ఆయన శ్రీశైలానికి బయలుదేరినట్లు తెలిసింది. ఆయనతో పాటు సీడబ్ల్యూసీ, సెంట్రల్ సాయిల్డ్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) నిపుణుల బృందం కూడా శ్రీశైలం డ్యాం పరిశీలించే అవకాశం ఉందని ఇంజనీర్లు పేర్కొన్నారు.

అర్ధరాత్రి హైడ్రామా



ఆదివారం అర్ధరాత్రి రోవర్‌తో హత్యా స్థలాన్ని నిర్ధారిస్తున్న రెవెన్యూ శాఖ సర్వే అధికారులు

- చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య జరిగిన ప్రదేశంలో సర్వే
- ఆర్డీఓల సమక్షంలో అనంతపురం, కర్నూలు జిల్లా సరిహద్దుల కొలత
- కర్నూలు జిల్లా పరిధిగా నిర్ధారణ
- కేసు గుంతకల్లు స్టేషన్ నుంచి చిప్పగిరికి మార్పు

గుంతకల్లు/ఆలూరు/చిప్పగిరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య కేసులో హైడ్రామా సాగింది. హత్య జరిగిన ప్రదేశం అనంతపురం జిల్లా గుంతకల్లు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిగా భావించి ఇక్కడి పోలీసులు కేసుపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఆ ప్రదేశం విషయంగా సందేహాలు ఉండటంతో ఆదివారం రాత్రి సర్వే చేపట్టారు. అర్ధరాత్రి దాకా గుంతకల్లు, పత్తికొండ రెవెన్యూ డివిజనల్ అధికారులు, కర్నూలు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సర్వే, రెండు జిల్లాల సర్వే అధికారులు, తహసీల్దార్లు, గుంతకల్లు డీఎస్పీ, సీఐలు సర్వేలో పాల్గొన్నారు. రోవర్ ద్వారా మ్యాప్ సర్వే చేపట్టి ఆ ప్రదేశం చిప్పగిరి పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుందని అర్ధరాత్రి 2 గంటలకు తేల్చారు. ఈ మేరకు అధికారికంగా రిపోర్టును విడుదల చేశారు.

మిగతా 7వ పేజీలో

13 పరీక్షా కేంద్రాల్లో పాలిసెట్

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో ఈనెల 30వ తేదీన 13 కేంద్రాలలో పాలిసెట్‌ను నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పాలిసెట్‌కు 3,747 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారని, వారందరికీ హాల్‌టికెట్స్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు.



లీప్.. రిలీఫ్..!

- ఇకపై అన్నీ ఒకే యాప్ ద్వారా నమోదు
- అమలులోకి తెచ్చిన విద్యాశాఖ
- ఉపాధ్యాయులపై తగ్గిన భారం

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం, నాడు-నేడు పనులు, విద్యార్థులకు కిట్లు పంపిణీ ఇలా ఒక్కొక్క దానికి ఒక్కో యాప్ ఉండేది. వాటి పాస్‌వర్డులను గుర్తించుకుని లాగిన్ కావడం ఉపాధ్యాయులకు తలకు మించిన భారంగా ఉంటుంది. అంతేగాక ఉపాధ్యాయుల వివరాలను సీఎస్‌సీ ద్వారా నమోదు చేయాల్సి వచ్చేది. విద్యాసంవత్సరంలో సుమారు 30కి పైగా యాప్‌లను వినియోగించాల్సి వచ్చేది. యాప్‌ల భారం తగ్గించండి మహాప్రభో అంటూ ఉపాధ్యాయులు మొత్తుకున్నా.. అప్పటి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. యాప్‌ల భారాన్ని తగ్గిస్తామని ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు ఇచ్చిన మాటను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిలబెట్టుకున్నారు. గత వారం నుంచి ప్రభుత్వం 'లీప్' (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) పేరుతో సమగ్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. గత ఐదేళ్ల పాటు ఉద్యోగులు, విద్యార్థుల హాజరుకు, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్ల నిర్వహణ, మనబడి నాడు-నేడు, పీఎంశ్రీ, పాఠ్యపుస్తకాల పంపిణీ ఇలా తదితర వివరాలు నమోదు చేసేందుకు వేర్వేరు యాప్‌లు ఉండేవి. వీటన్నింటిలో వివరాలు నమోదు చేయడం, వాటి ఐడీలు, పాస్‌వర్డ్‌లు గుర్తుపెట్టుకోలేక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారు. కానీ ప్రస్తుతం వివిధ రకాల యాప్‌లను తొలగించి వాటన్నింటి స్థానంలో ఒకే ఒక 'లీప్' యాప్‌ను తెచ్చి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఊరటనిచ్చింది.

డ్యాష్ బోర్డు విభాగంలో...

విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, ఎండీఎం తీసుకున్న వారి సంఖ్య అసెస్‌మెంట్, అపార్ స్థితి, ఆధార్ నమోదు, విద్యార్థుల బదిలీలు, విద్యాకమిటీ, తల్లిదండ్రుల కమిటీల సమావేశాల సంఖ్య శాతం తదితర అంశాలను పొందుపరిచారు.

విద్యార్థి విభాగంలో..

విద్యార్థి అపార్ నెంబరుతో లాగిన్ అయి ఆ విద్యార్థికి సంబంధించిన అన్ని అంశాలను దాని ద్వారా తెలుసుకునేలా లీప్ యాప్‌ను రూపొందించారు. మరికొన్ని విభాగాలకు సంబంధించిన సమాచారం త్వరలోనే అందుబాటులోకి రానున్నట్లు డిస్‌ప్లే అవుతుంది. ఉపాధ్యాయుల ప్లేస్లిప్, మెడికల్ బిల్లుల స్థితి తదితర అంశాలు దీనిలో ఉన్నాయి. మొత్తానికి అనేక యాప్‌ల గోల లేకుండా ఒకే యాప్ ద్వారా పాఠశాలలకు చెందిన అన్ని అంశాలు నమోదు చేసే అవకాశం కల్పించడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● లీప్ యాప్‌లోని అంశాలివే...

గతంలో ఉన్న సిమ్స్ యాప్ పాస్‌వర్డ్, యూజర్ నేమ్ ఉపయోగించి లీప్ యాప్‌తో లాగిన్ అవ్వొచ్చు. లాగిన్ అయ్యాక స్టూడెంట్, డిపార్టుమెంటు అనే రెండు విభాగాలు కనిపిస్తాయి. దీనిలో డిపార్టుమెంటుపై క్లిక్ చేస్తే ఆరు అంశాలు కనిపిస్తాయి. స్కూల్, టీచర్, కమ్యూనికేషన్, స్టూడెంట్, గవర్నెన్స్, డ్యాష్‌బోర్డు డిస్‌ప్లే అవుతాయి. వీటిలో టీచర్‌పై క్లిక్ చేస్తే టీచర్ ప్రొఫైల్ ఓవర్ వ్యూ టీచర్ లీడర్‌షిప్ అండ్ ట్రైనింగ్, టీచర్ సర్వీసెస్, టీచర్ రీసోర్సెస్ అనే అంశాలు కనిపిస్తాయి. టీచర్ సర్వీసెస్‌లో అటెండెన్స్ అనే టెయిల్ ద్వారా హాజరు వేయవచ్చు. ఇదేటెయిల్‌లో లీప్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలను పొందుపరిచారు.



గవర్నెన్స్ విభాగంలో...

సీఎస్‌సీ, సమగ్ర శిక్ష, మిడ్ డే మీల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే నాలుగు ప్రధాన అంశాలను పొందుపరిచారు. గతంలో ఉన్న ఐఎంఎంఎస్ యాప్ మిడ్‌డే మీల్ విభాగంలో ఓపెన్ అయి మధ్యాహ్న భోజన పథకం ఫొటోలు అప్‌లోడు చేసి వీలు కల్పించారు. ఇందులోనే బాత్‌రూమ్‌ల తనిఖీని నమోదు చేసే టీఎంఎఫ్‌ను కూడా జత చేశారు. సమగ్ర శిక్ష విభాగంలో పాఠశాల కమిటీ, తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర, కోకరిక్యులర్ యాక్టివిటీస్‌లను పొందుపరిచారు.

సీఎస్‌సీ విభాగంలో...

హెచ్‌ఎం అప్రూవల్, టీచర్ ఇన్‌ఫర్మేషన్ అంశాలు ఉన్నాయి. దీనిద్వారా నేరుగా ఉపాధ్యాయులు తమ సమాచారాన్ని సీఎస్‌సీ సైట్‌లోకి వెళ్లకుండానే నమోదు చేసే వీలుంది. స్టూడెంట్ విభాగంలో విద్యార్థి ప్రొఫైల్ ఓవర్ వ్యూ పెర్ఫార్మెన్స్ ఎన్ టైటిల్‌మెంటు యాక్సెస్ అనే విభాగాల ద్వారా విద్యార్థులకు సంబంధించిన అంశాలను నమోదు చేసే వీలు కల్పించారు.

కళాకారుల కోసమే అరుణభారతి

వ్యవస్థాపక అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి



బనగానపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కళాకారుల సంక్షేమం, వారిలోని కళా నైపుణ్యాన్ని మరింత విస్తృతం చేయడం లక్ష్యంగా అరుణభారతి సాహితీ సంస్థను ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. సోమవారం బనగానపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మే రెండోతేదీన శుక్రవారం సాయంత్రం 6 గంటలకు అరుణభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బనగానపల్లె పట్టణంలోని బీసీ గుర్రెడ్డి కాంప్లెక్స్ ఆవరణలో ప్రియదర్శిని పాఠశాల ఎదురుగా నిర్వహించే ఈ కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మిమిక్రీ ప్రదర్శన, కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యప్రదర్శనలు ఉంటాయన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మిమిక్రీ కళాకారుడు, సినిమా డబ్బింగ్ ఆర్టిస్టు ఎం.జితేంద్ర ప్రదర్శన ఉంటుందన్నారు. అదేవిధంగా షేక్ కరీముల్లా నటరాజ నృత్య కళామందిర్ వారిచే కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యప్రదర్శనలు జరుగుతాయన్నారు. కవులు, కళాకారులను ఆదరించి వారిని ప్రోత్సహించడమే అరుణభారతి సంస్థ లక్ష్యమన్నారు. గతంలో తమ సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. భవిష్యత్‌లో అరుణభారతి సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు బీసీ రాజారెడ్డి తెలిపారు.

యాగంటిలో చిత్ర దర్శకుడు సుకుమార్



అభిమానులతో చిత్ర దర్శకుడు సుకుమార్

బనగానపల్లె, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి ఉమామహేశ్వరస్వామిని ప్రముఖ చిత్రదర్శకుడు సుకుమార్ సోమవారం సాయంత్రం దర్శించుకున్నారు. పూజారులు సుకుమార్‌కు తీర్థ ప్రసాదాలు అందించారు. పుష్ప-3 సినిమా చిత్రీకరణ నేపథ్యంలో యాగంటికి వచ్చినట్లు సమాచారం. పలువురు అభిమానులు సుకుమార్‌తో సెల్ఫీలు దిగి సందడి చేశారు.

ఉపాధి కూలీలకు ఊరట

జిల్లాకు రూ.40 కోట్లు విడుదల



కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఉపాధి హామీ కూలీల 80 రోజుల నిరీక్షణకు తెరపడింది. జనవరి నుంచి ఇప్పటి దాకా పేరుకుపోయిన ఉపాధి కూలీల బకాయిలో రెండు నెలల మొత్తాన్ని అంటే రూ.40 కోట్లను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు కర్నూలు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ వెంకటరమణయ్య సోమవారం విలేకరులకు తెలిపారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఢిల్లీకి వెళ్లి ఉపాధి కూలీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, వారు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో రూ.800 కోట్ల బకాయిలు ఉండగా.. అందులో రూ.600 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసినట్లు నీటి యాజమాన్య సంస్థ అధికారవర్గాలు తెలిపాయి. జిల్లాలో 15 లక్షల పనిదినాలకు రూ.40 కోట్లు విడుదలయ్యాయని, త్వరలోనే మిగిలిన పని దినాల వేతన బకాయిలు విడుదల చేస్తుందని స్పష్టం చేశారు. ఎండల తీవ్రత పెరుగుతుండటం, వ్యవసాయ పనులు లేకపోవడం ప్రతి కుటుంబానికి వంద పనిదినాలు లక్ష్యం కావడంతో కూలీలు ఉదయం 7 గంటలకే పనికి వెళ్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధి కూలీల మొత్తాన్ని రూ.307లకు పెంచింది. నిబంధనల మేరకు 15 రోజులకు ఒకసారి వేతనాలు చెల్లించాలి. ఎప్పటికప్పుడు ఎఫ్‌టీవో అప్‌లోడు చేసిన 15 రోజులకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. అయితే.. ఈసారి మూడు నెలలుగా ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో కూలీల సంఖ్య తగ్గిపోతోంది. ఇటీవల కలెక్టర్ రంజిత్ బాషా గ్రామాల్లో ఉపాధి కూలీలకు పనులు కల్పించాల్సింది పోయి భారీ ఎత్తున పనిదినాల లోటు కనిపిస్తోందని, వెంటనే ఆ శాఖ సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడి మేరకు జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి కూలిలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

రోజుకు పనుల్లో 80వేల నుంచి 90వేల దాకా : కర్నూలు జిల్లలో ప్రస్తుతం ఖరీఫ్, రబీ సీజన్లు ముగిసిపోయాయి. ముఖ్యంగా పశ్చిమ ప్రాంత నియోజకవర్గాలు పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆలూరు, ఆదోని, డోన్ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున కూలీలు గుంటూరు, బెంగళూరు, హైదరాబాదు ప్రాంతాలకు పని కోసం వలస వెళ్తున్నారు. గ్రామాలకు గ్రామాలు వలస వెళ్తున్నా స్థానికంగా పనులు కల్పించడంలో అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు ఏ మాత్రం పని చేయడం లేదు. కర్నూలు జిల్లాలో 3.50 లక్షల కుటుంబాలకు జాబ్ కార్డులు ఇచ్చారు. ఏప్రిల్ నుంచి మే, జూన్ నెలలో దాదాపు ప్రతిరోజు లక్ష మందికి పనులు కల్పించాలని నీటి యాజమాన్య సంస్థ అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. అయితే వివిధ కారణాల వల్ల మొదట్లో 50వేల మంది మాత్రమే పని చేస్తూ వచ్చారు. ప్రస్తుతం కలెక్టర్ ఒత్తిడి మేరకు 80 నుంచి 90 వేల మంది దాకా పనులకు వస్తున్నట్లు నీటి యాజమాన్య సంస్థ అధికార వర్గాలు తెలిపాయి. ఎండలు మండిపోతుండటంతో పాటు వడదెబ్బ సోకి పలువురు గాయాల పాలవుతుండటంతో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య తగ్గిపోతోంది. ప్రభుత్వం ఉపాధి పనులు చేసే వారికి రోజుకు రూ.307 చెల్లిస్తామని ప్రకటించినా ఆ మేరకు మొత్తం కూలి అందడం లేదు. పూర్తి స్థాయిలో వేతనం అందించేందుకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పలు చర్యలు చేపట్టిందని డ్వామా పీడీ వెంకటరమణయ్య తెలిపారు.

పంచమవేదంగా శాస్త్రీయ నృత్యం

- సంస్కృతిని ప్రతిబింబించే పలు నృత్యరీతులు
- ఆదరణ కోల్పోతున్న జానపద, సంప్రదాయ కళలు
- నేడు అంతర్జాతీయ నృత్య దినోత్సవం



నాట్యం చేస్తున్న కళాకారిణి



ప్రతి జాతికి కొన్ని నాట్య పద్ధతులు ఉంటాయి. ఆదిమ యుగం నుంచి జానపద నాట్యరీతులు కొనసాగుతున్నాయి. మధ్యలో సంప్రదాయ నృత్యాలు వచ్చాయి. ప్రజల కళా వ్యక్తీకరణలో నాట్యం ఒకటి. ఇటీవల జానపద, సంప్రదాయ నాట్యాలు రెంటికీ ఆదరణ తగ్గిపోతోంది. తిరిగి అన్ని రకాల నాట్యకళలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఏప్రిల్ 29న అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని నిర్వహించాలని యునెస్కో నిర్ణయించింది. ఇందులో భాగమైన అంతర్జాతీయ డాన్స్ కౌన్సిల్ సహకారంతో 1982 నుంచి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. నేడు అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా కథనం.

ఆత్మకూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అతిప్రాచీన వేదాల కలయికతో పంచమ వేదమైన నాట్యం జీవం పోసుకుందని అంటారు. నాలుగు వేదాల నుంచి 4 నాట్యాంగాలను బ్రహ్మ గ్రహించి నాట్య వేదాన్ని నిర్మించారని నమ్మకం. అయితే మానవ శ్రమ నుంచి కళలు వికసించాకని, నాట్యం అందులో ఒకటి అని మానవ శాస్త్రం, చరిత్ర నిర్ధారిస్తున్నాయి. కూచిపూడి, భరతన్యాటం, కథక్, కథకళి, మణిపురి, ఒడిస్సీ, మోహినీ ఆట్టం వంటి సంప్రదాయ నృత్యాలకంటే అత్యంత ప్రాచీనమైనవి గిరిజన, జానపద నృత్యాలు, వీధినాటకం, బుర్రకథ, గంటపర్థాల, కోలాటం, పేరిణి, తోలుబొమ్మలాట, థింసా నృత్యం, చిందు నృత్యాలు. ఇవి మానవుల శ్రమ నుంచి, సృజనాత్మకత నుంచి పుట్టి కొనసాగుతున్నాయి.

సంప్రదాయ నృత్యాలైన కూచిపూడి, భరతన్యాటం, కథక్, కథకళి, మణిపురి, ఒడిస్సీ మోహినీ ఆట్టం వంటి నాట్యాలపై కూడా కళాకారుల్లో ఆసక్తి తగ్గిందని చెప్పవచ్చు. ఎంతో సాధనతో కూడిన ఈ కళలపై పట్ల నేటి సమాజంలో కొద్దిగా ఆదరణ వున్నప్పటికీ గ్రామీణ స్థాయిలో మాత్రం ఈ కళలను నమ్ముకున్న వారికి ఎలాంటి ప్రోత్సాహం ఉండటం లేదు. జానపద, ప్రజా కళలు కూడా ఆధునిక సినిమా, టీవీ వంటి వాటి వల్ల ఆదరణ కోల్పోతున్నాయి. వీటన్నిటికీ ప్రభుత్వం చేయూతనందించాల్సి ఉంది.



సంప్రదాయ నృత్యంలో సాయి లిక్షితాశ్రీ ..

నందికొట్కూరు పట్టణానికి చెందిన జగదీశ్వరుడు, శ్రావణి దంపతుల కుమార్తె సాయి లిక్షితాశ్రీ కూచిపూడిలో 2600కు పైగా ప్రదర్శనలు చేసి అరుదైన రికార్డులను సొంతం చేసుకుంది. చిన్నతనం నుంచే ఓ వైపు చదువుల్లో రాణిస్తూ మరో వైపు సంప్రదాయ నృత్యంలో తనకంటూ ఓ ప్రత్యేతను సంపాదించుకుంది. ప్రస్తుతం నందికొట్కూరులోనే ఎంఎస్సీ చదువుతున్న సాయిలిక్షితాశ్రీ 13ఏళ్ల వయసులోనే 21 ఉన్నతస్థాయి అవార్డులను, బిరుదులను సొంతం చేసుకుంది. 2015 జనవరి 26న జరిగిన గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భారత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా రాష్ట్రపతి అవార్డును దక్కించుకుంది. హైద్రాబాద్‌లో 2013లో ఆరుగంటల పాటు నిర్విరామంగా కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించుకుంది. 2012లో అన్నమయ్య కీర్తనల్లో 12గంటల పాటు కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి ప్రపంచ స్థాయి అవార్డును కూడా దక్కించుకుంది. 2022లో దూరదర్శన్ వారు గ్రేడ్ ఆర్టిస్టుగా గుర్తింపునిచ్చారు. నందికొట్కూరు పట్టణంలో లిక్షితాశ్రీ నృత్య కళాశాల పేరుతో ఆసక్తి గల కళాకారులు సంప్రదాయ నృత్యంపై శిక్షణ ఇస్తున్నారు.



పద్మశ్రీ అందుకున్న ఐఐఐటీడీఎం చైర్‌పర్సన్ విజయలక్ష్మి

● కర్నూలు క్యాంపస్‌లో సంబరాలు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఐఐఐటీడీఎం గవర్నింగ్ బోర్డు చైర్ పర్సన్ డాక్టర్ దేశమానే విజయలక్ష్మికి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ఇచ్చి గౌరవించింది. ఈ అరుదైన పద్మశ్రీ అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతిభవన్‌లో విజయలక్ష్మి అందుకున్నారు. వైద్యరంగంతో పాటు విద్య, సామాజిక సేవా రంగాల్లో కృషి చేసినందుకు గానూ ఆమెకు పద్మశ్రీ వరించింది. 1955లో కర్ణాటక రాష్ట్రం కలబురిగి జిల్లాలోని జేవరధి తాలుకాలోని కోబాళ్ గ్రామంలో జన్మించిన ఆమె కృషి, పట్టుదల, సేవాభావంతో దేశం గర్వించేస్థాయికి ఎదిగారు. తండ్రి బాబురావు టెక్స్‌టైల్ మిల్లులో కార్మికుడిగా పని చేశారు. తల్లి ఇంటింటికి వెళ్లి కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం గడిపారు. విజయలక్ష్మి 2015లో బ్రెస్ట్ క్యాన్సర్ స్పెషలిస్టుగా పదవీ విరమణ పొందారు. 2024లో భారతీయ సమాచార్ సాంకేతిక డిజైన్, మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థ (ఐఐటీడీఎం కర్నూలు) గవర్నింగ్ బోర్డు చైర్ పర్సన్‌గా నియమితులయ్యారు. డాక్టర్ విజయలక్ష్మి పద్మశ్రీ అవార్డు అందుకోవడంతో కర్నూలు ఐఐఐటీడీఎం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గురుమూర్తి ఆధ్వర్యంలో విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది సంబరాలు చేసుకున్నారు.



రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకుంటున్న విజయలక్ష్మి

నేడు టీజీవీ కళాక్షేత్రంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవం

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): టీజీవీ కళాక్షేత్రం, శ్రీ నటరాజ నృత్య కళామందిర్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవం, కూచిపూడి, భరతనాట్యం వర్క్‌షాప్ ముగింపు వేడుకలు నిర్వహిస్తున్నట్లు నృత్య గురువు ఎస్.కరీముల్లా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, హైదరాబాదు స్కూల్ ఆఫ్ డ్యాన్స్ డైరెక్టర్ పద్మా కల్యాణ్, ప్రొద్దుటూరు నాట్యాచార్యుడు పఠాన్ మొహిద్దీన్ హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్‌లో శిక్షణ పొందిన కళాకారులతో నృత్య ప్రదర్శనలు ఉంటాయని కరీముల్లా పేర్కొన్నారు.

● నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో వేసవి సెలవుల్లో బాలబాలికలకు కూచిపూడి నృత్యంలో శిక్షణలు అందిస్తున్నారు. అలాగే సెలవుల అనంతరం శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు కూడా ఈ శిక్షణలు కొనసాగుతున్నాయి. నగరంలో నృత్య గురువులు భార్గవ్, ఎస్. కరీముల్లా, నాగసాయి ప్రదీప్, సూర్యకళా అకాడమీ అధ్యక్షుడు బి. సుధాకర్ వంటి వారు కూచిపూడి, భరతనాట్యం అంశాలలో శిక్షణలు ఇస్తున్నారు.



ఇటీవల టీజీవీ కళాక్షేత్రంలో జరిగిన జాతీయ నృత్య సమ్మేళనంలో కళాకారులు (ఫైల్)

భావి తరాల కోసమే శిక్షణ



శాస్త్రీయ నృత్యాలను భావి తరాలకు అందజేసేందుకు నిత్యం శిక్షణలు అందిస్తున్నాం. వేసవిలో కళాక్షేత్రంలో ప్రత్యేక షార్ట్ టైమ్ శిక్షణలతోపాటూ ఇతర రోజుల్లో వారంలో మూడు రోజుల పాటు శిక్షణలు ఇస్తున్నాం. గత 18 ఏళ్లుగా శిక్షణలు ఇస్తున్న నాకు భారతీయ నాట్య మయూరి అవార్డు, నృత్య శేఖర అవార్డు, నృత్య శిరోమణి, నాట్య కళారత్నం వంటి అవార్డులు లభించాయి. అలాగే నగరంలో ఏటా రెండు సార్లు జాతీయ స్థాయిలో నృత్య పోటీలు నిర్వహిస్తూ వివిధ రాష్ట్రాల కళాకారులతో ప్రదర్శనలు ఇప్పిస్తూ ఆ కళారీతులను జిల్లా వాసులకు పరిచయం చేస్తున్నాను. హైదరాబాదు దూరదర్శన్ కేంద్రం నాకు బి గ్రేడ్ ఆర్టిస్టుగా గుర్తింపు పత్రం ఇచ్చింది.

- ఎస్ కరీముల్లా, నృత్య గురువు, కర్నూలు

ఫుడ్ ప్రాసెసింగ్ అభివృద్ధికి సహకరించండి

● కేంద్ర మంత్రిని కలిసిన టీజీ భరత్



కేంద్ర మంత్రిని కలిసిన మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కోరారు. సోమవారం ఢిల్లీలోని కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌ను టీజీ భరత్ కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబధించి కీలక అంశాలపై చర్చించామని, రాష్ట్రంలో టమోటా పంటను అధికంగా పండిస్తున్న రాయలసీమ జిల్లాల్లో అపరేషన్ గ్రీన్స్ పథకం కింద మొదటి విడత, రెండో విడత మొత్తం రూ. 9.76 కోట్లు విడుదల చేశామని, 6 నెలల్లోపు ప్రాజెక్టును పూర్తి చేయడానికి మిగిలిన గ్రాంట్ మొత్తం రూ. 34.17 కోట్లు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరామని తెలిపారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 175 పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పీఎంకేఎస్‌వైసీ స్కీమ్ కింద ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టాలనుకునే వారు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకునేలా ఏపీకీ వెసులుబాటు కల్పించాలని మంత్రి టీజీ భరత్ కోరారు.

రుణాలు వినియోగించుకోండి

నంద్యాల రూరల్ ఏప్రిల్, 28 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా వచ్చే సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ సూచించారు. సోమవారం స్థానిక పద్మావతి నగర్‌లోని కార్యాలయంలో ముస్లింలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీల అభ్యున్నతికి ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం రూ.174 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. వివిధ రకాల ఉపాధి, శిక్షణ కార్యక్రమాల కోసం రూ.21 కోట్ల ప్రస్తుతం కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మైనార్టీ నాయకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నీట్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నీట్ యూజీ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం నీట్ యూజీ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెండెంట్‌లు, లైన్ డిపార్టుమెంటు అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మే 4న నీట్ యూజీ పరీక్ష నగరంలోని 16 కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షకు 4466 విద్యార్థులు హాజరు కానున్నారని, మే 4వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఒకొక్క పరీక్ష కేంద్రం వద్ద 2+2 పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అలాగే కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ విధించాలని తహసీల్దార్‌లను ఆదేశించారు. జిల్లా స్థాయిలో ఒక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేయాలని డీఆర్వోను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, నోడల్ అధికారి పాయల్ ప్రియదర్శిని, డీఎస్పీ బాబు ప్రసాద్, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌రాజు పాల్గొన్నారు.

పాలిసెట్‌పై డీఆర్వో సమీక్ష

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కామన్ పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్స్ నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయా లని డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 30న నిర్వహించే కామన్ పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్స్ నిర్వహణపై సంబంధిత అధికారులతో డీఆర్వో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో 12 సెంటర్లలో 4584 మంది, ఆదోనిలోని 10 సెంటర్లలో 2768 మంది మొత్తం 22 సెంటర్లలో 7352 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవు తున్నారని తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబడవని అన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో విజయశ్రీ, పాలిటెక్నిక్ ఎగ్జామినేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఓ.శ్రీధర్, కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్ బాబు, అర్బన్ తహసీల్దార్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఇండియన్ మెడికల్ పార్లమెంటేరియన్స్ ఫోరం జాయింట్ కన్వీనర్‌గా బైరెడ్డి శబరి



నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరిని ఇండియన్ మెడికల్ పార్లమెంటేరియన్స్ ఫోరం జాయింట్ కన్వీనర్‌గా భారత ప్రభుత్వం నియమించింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. పార్లమెంట్ సభ్యులకు భారతదేశంలో ప్రజారోగ్య సమస్యలను పరిష్కరించడంలో విశేషమైన సహకారం అందిస్తుందని బైరెడ్డి శబరి తెలిపారు. 2006లో ఐఎంపీఎఫ్ ప్రారంభమై దేశం ఆరోగ్యం సంరక్షణ ల్యాండ్‌స్కేప్‌లో కీలకమైన శక్తిగా ఉద్భవించిందన్నారు. పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన వైద్య నిపుణులతో కూడిన ఫోరం క్లిష్టమైన ఆరోగ్య సమస్యలపై ప్రజలకు, పార్లమెంట్‌కు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడానికి వీలు కల్పిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి శబరి కృతజ్ఞతలు తెలిపారు.

15 లోగా పొగాకు కొనండి

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మే 15 తేదీలోపు రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య పొగాకు కంపెనీలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పొగాకు కొనుగోలుపై కంపెనీల ప్రతినిధులు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ పొగాకు కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతూ పొగాకు కొనుగోలు ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, అలా కాకుండా మంచి ధర ఇవ్వాలని సూచించారు. ఈ విషయానికి సంబంధించి కంపెనీ ప్రతినిధులతో మరొక సమావేశాన్ని నిర్వహించి జిల్లాలో పండించిన పొగాకు పూర్తిగా మంచి ధరతో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని జేసీ స్పష్టం చేశారు.

అర్ధరాత్రి హైడ్రామా

(5వ పేజీ తరువాయి)



లక్ష్మీనారాయణ (ఫైల్)

హత్య జరిగిన ప్రదేశం చిప్పగిరి పోలీసు స్టేషన్ పరిధిలోకి మారడంపై బాధితవర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. కేసు గుంతకల్లులోనే నమోదు చేయాలని, అప్పుడే తమకు న్యాయం జరుగుతుందని లక్ష్మీనారాయణ కుటుంబం, బంధువులు డిమాండ్ చేశారు. చిప్పగిరి స్టేషన్‌లో విచారణ జరిగితే తమకు న్యాయం జరగదని సందేహాన్ని వ్యక్తంచేశారు. ఓ పోలీసు అధికారి కారణంగా తమకు అన్యాయం జరిగిందని, ఆయన ఆధ్వర్యంలో విచారణ పారదర్శకంగా సాగుతుందన్న నమ్మకం లేదన్నారు. ఉన్నతాధికారితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. సాంకేతికంగా ఎదురయ్యే సమస్యలను పోలీసులు బాధిత వర్గానికి వివరించారు.

నలుగురిపై కేసు

చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య ఘటనలో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న ఆయన కుమారుడు వినోద్‌కుమార్ నుంచి చిప్పగిరి పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. చిప్పగిరికి చెందిన వైకుంఠం శివప్రసాద్, వైకుంఠం మల్లికార్జున చౌదరి, కొండా రామాంజనేయులు, అరికెర మల్లికార్జునను నిందితులుగా పేర్కొంటూ వినోద్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు చిప్పగిరి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. హత్యకు ఉపయోగించిన టిప్పరు డ్రైవర్‌ను చిప్పగిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. టిప్పర్ యజమాని, డ్రైవర్‌ను విచారించడం ద్వారా కేసును రెండు, మూడు రోజుల్లోనే పరిష్కరించే అవకాశాలు ఉన్నాయి. చిప్పగిరి లక్ష్మీనారాయణ గుంతకల్లులో చేసిన పంచాయితీలపై కూడా కొందరిని పోలీసులు అనుమానిస్తున్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించే అవకాశాలున్నట్టు తెలిసింది. గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం లక్ష్మీనారాయణ మృతదేహాన్ని ఉదయం 11 గంటల ప్రాంతంలో చిప్పగిరికి తరలించారు.

చిప్పగిరిలో లక్ష్మీనారాయణ అంత్యక్రియలు



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆలూరు/చిప్పగిరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు చిప్పగిరి లక్ష్మీనారాయణను హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ పార్టీ, ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. దారుణ హత్యకు గురైన లక్ష్మీనారాయణ అంత్యక్రియలు సోమవారం చిప్పగిరిలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. అంత్యక్రియలకు కాంగ్రెస్ పార్టీతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు వేలాదిగా తరలివచ్చారు. మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్‌మాదిగ, నంద్యాల డీసీసీ అధ్యక్షులు జెంగిటి లక్ష్మీనారాయణ తదితరులు చిప్పగిరి లక్ష్మీనారాయణ పార్థివదేహంపై కాంగ్రెస్ పార్టీ జెండాను ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసుల వైఫల్యంతోనే లక్ష్మీనారాయణ హత్య జరిగిందన్నారు. తనపై హత్యకు కొందరు కుట్ర చేస్తున్నారంటూ పలుమార్లు డీఎస్పీతో పాటు ఎస్పీ ఎదుట లక్ష్మీనారాయణ మొరపెట్టుకున్నా పోలీసులు రక్షణ కల్పించలేదన్నారు. తక్షణమే పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్యను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మీనారాయణ హత్యపై సమగ్ర దర్యాప్తు జరిపి హంతకులను కఠినంగా శిక్షించాలన్నారు. దళితుల సంక్షేమానికి లక్ష్మీనారాయణ పోరాటాలు చేశారన్నారు. నివాళులర్పించిన వారిలో మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దాదా గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, ప్రభాకర్, బోయ క్రాంతినాయుడు, రమేష్‌యాదవ్, మురళీకృష్ణంరాజు, బజారన్న, మహేంద్రనాయుడు, నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు తిరుపాల్, సుభాష్, గాదిలింగ, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.



హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

ఫోన్‌లో పరామర్శించిన వైఎస్ షర్మిల

హత్యకు గురైన కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలన్నారు. హత్యకు కారకులైన వారిని అరెస్టు చేయాలని కర్నూలు ఎస్పీని కోరినట్లు తెలిపారు.

లోపించిన శాంతిభద్రతలు

నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నంద్యాల డీసీసీ అధ్యక్షుడు

కల్లూరు, ఏప్రిల్ 28 :(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళిత బహుజన, గిరిజన, మైనార్టీలపై రోజు రోజుకూ హత్యలు పెరుగుతున్నాయని, రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయన్నారు. ఈ అంశాన్ని జాతీయ ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకెళతామన్నారు. పోలీసుల వైఫల్యంతోనే హత్య జరిగిందని తక్షణమే పత్తికొండ డీఎస్పీని సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ చిప్పగిరి లక్ష్మీనారాయణ మృతికి కారణమైన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు జెంగిటి లక్ష్మీనరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన రాష్ట్ర మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీతో కలిసి చిప్పగిరిలో లక్ష్మీనారాయణ అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో తీవ్ర ఉద్రిక్తత

● కల్వటాలవాసిపై కాంట్రాక్ట్ కంపెనీ ఉద్యోగుల దాడి ● పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



దాడికి యత్నిస్తున్న ప్రైవేటు కాంట్రాక్ట్ కంపెనీ సిబ్బంది

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో సోమవారం మధ్యాహ్నం తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకున్నది. కల్వటాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు క్రిష్ణ రంగారెడ్డి రామ్‌కో పరిశ్రమలోని ఓ సబ్ కాంట్రాక్ట్ కంపెనీ ప్రతినిధి వద్దకు వెళ్లి వర్కులపై చర్చించారు. స్థానికంగా ఉన్న తమకు కాంట్రాక్ట్ పనులు కల్పించాలని కోరారు. అయితే సదరు ప్రతినిధి నిర్లక్ష్యంగా, అవమానకర రీతిలో సమాధానం చెప్పడంతో మాటా మాటా పెరిగి, ఘర్షణ పడ్డారు. ఇంతలోనే సిబ్బంది టీడీపీ నాయకుడిపై దాడికి యత్నించారు. అనుచరులపై దాడి చేసి గాయపరిచారు. ఓ వాహనంపై దాడి చేయడంతో అద్దాలు పగిలిపోయాయి. దీంతో పరిశ్రమలో ఏం జరుగుతుందో అర్థంకాక కిందిస్థాయి సిబ్బంది, కార్మికులు తీవ్ర ఆందోళన చెందారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కాంట్రాక్ట్ కంపెనీలో పనిచేసే నాన్‌లోకల్ సిబ్బంది స్థానికులపైనే దాడికి యత్నించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీని వెనుక కుట్ర కోణం ఏమైనా ఉందా అనే అనుమానాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో ఉద్రిక్తత తెలుసుకున్న సీఐ రమేష్‌బాబు హుటాహుటిన అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మరోవైపు రామ్‌కో సిమెంట్ పరిశ్రమ అధికారులు, ఉద్యోగులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలకు సర్ది చెప్పారు. అయితే ఇరువర్గాలు ఎటువంటి ఫిర్యాదు చేయలేదని సీఐ వెల్లడించారు.

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

కుటుంబంలో విషాదం



జనార్దన్ (ఫైల్)

రుద్రవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సిబ్బంది చేయవలసిన పని ఇతరులు చేయవలసి రావడంతో రుద్రవరంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. గ్రామంలో వరి బస్తాల లోడ్‌తో వెళుతున్న లారీలకు విద్యుత్ సర్వీసు వైర్లు తగులుతుండడంతో సర్వీసు వైరును సరిచేయడానికి 11కేవీ విద్యుత్‌స్తంభాన్ని జనార్దన్(42) ఎక్కాడు. సర్వీసు వైరుకు ఉన్న జీ వైరు 11 కేవీ వైరుకు తగలడంతో విద్యుత్ సరఫరా అయి స్తంభం నుంచి కింద పడ్డాడు. అతడ్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. విద్యుత్ వైర్లు, విద్యుత్ సర్వీసు వైర్లలో ఏదైనా సమస్య ఉంటే లైన్‌మెన్లు సరి చేయాలి. విద్యుత్ లైన్‌మెన్లు గ్రామస్తుల సపోర్టు తీసుకుని పనులు చేయిస్తున్నారు. ఇది ఎంత వరకు సమంజసమని స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. మృతుడు జనార్దన్ భార్యవిజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

ఎల్‌సీ తీసుకోలేదు: సబ్ ఇంజనీరు రాజశేఖర్

రుద్రవరం సబ్ స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకోలేదు. ఏదైనా విద్యుత్ వైర్లు సరి కానప్పుడు ఎల్‌సీ తప్పకుండా తీసుకోవాలి. ప్రమాద సంఘటన వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. . లైన్‌మెన్ దగ్గర ఉండి ఈ పని బాధ్యతగా చేయించాల్సిన పని ఇది.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

పెద్దకడబూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరు మండలంలోని దొడ్డిమేకల గ్రామంలో కొంతమంది దుండగులు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు, స్థానికులు తెలిపిన వివరాలివీ.. దొడ్డిమేకల గ్రామంలోని పురాతనంగా ఉన్న తిమ్మప్పస్వామి దేవాలయం ముందు కొంతమంది ఎక్స్‌వేటర్‌తో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. ఈ ఘటనను స్థానిక రైతులు ఆలస్యంగా గుర్తించారు. గ్రామస్థులు ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఇచ్చారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పాములపాడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కాల గ్రామానికి చెందిన లావణ్య (35) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. అప్పుల బాధ తాళలేక సోమేశ్వరుడు అనే రైతు తన కుటుంబ సభ్యులైన తల్లి, భార్య, కుమార్తె, కుమారుడుకి గతనెల 3న కూల్‌డ్రింక్‌లో పురుగులమందు కలిపి ఇచ్చి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విదితమే. కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ గత కొద్దిరోజుల క్రితం సోమేశ్వరుడు కుమారుడు భరత్ మరణించగా, సోమవారం భార్య లావణ్య మరణించింది. మిగతా కుటుంబ సభ్యులు చికిత్స పొందుతున్నారు.

కర్నూలులో వ్యక్తి..

కర్నూలు క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ముజఫర్‌నగర్‌కు చెందిన పాపరాయుడు (43) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పాపరాయుడు సెంట్రింగ్ పని చేస్తూ జీవనం సాగించేవారు. ఆయనకు భార్య మణెమ్మ, ఒక కొడుకు, కూతురు ఉన్నారు. గత కొంత కాలంగా సెంట్రింగ్ పని మానేసి మద్యానికి బానిసయ్యారు. ఈ నెల 8వ తేదీన తాగిన మైకంలో భార్యను భయపెట్టాలనే ఉద్దేశంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. బంధువులు వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మధుసూదన్‌గౌడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెద్దకడుబూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమాపురం గ్రామ సమీపంలోని నలంద బీఈడీ కళాశాల సమీపంలో ఆదోని- ఎమ్మిగనూరు ప్రధాన రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందారు. ఏఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాలివీ.. చిత్తూరు జిల్లా పూతలపట్టు గ్రామానికి చెందిన సుమతి, ధరణి, నాగమ్మ కోడి పిల్లల వ్యాపారం చేసుకునేందుకు ఆదోని నుంచి ఆటోలో ఎమ్మిగనూరుకు బయలు దేరారు. ఆదోని నుంచి అతివేగంగా వస్తున్న ట్రాలీ వాహనం ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుమతి(45) అక్కడిక్కడే మృతి చెందగా.. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ధరణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీఈడీ సెమిస్టర్‌లో ఇద్దరు డీబారు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్‌లో ఇద్దరు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 14 పరీక్ష కేంద్రాల్లో 3,384 మంది దరఖాస్తు చేసుకోగా, 2,992 మంది పరీక్షలు రాశారని పేర్కొన్నారు. జీవీఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ డోన్‌లో ఒకరు, శ్రీసుధా కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ డోన్‌లో మరొకరు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించి డీబారు చేశామని తెలిపారు.



కలపరిలో జ్వరాల కలకలం

● తగ్గని జ్వరాలు, వైరల్ ఫీవర్ కేసులంటున్న అధికారులు
● నేడు కలపరిలో పర్యటిస్తున్న స్టేట్ వైద్యాధికారులు



యంకమ్మ (ఫైల్)



గ్రామంలో కొనసాగుతున్న వైద్యశిబిరం

కర్నూలు హాస్పిటల్/ఆస్పరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విష జ్వరాలతో ఆస్పరి మండలం కలపరి గ్రామం వణుకుతోంది. గ్రామంలో 350 మందికి పరీక్షలు నిర్వహించగా.. 53 మందికి విషజ్వరాలు సోకినట్లు వైద్యఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 19వ తేదీ నిర్వహించిన పరీక్షల్లో ఏకంగా 10 మందికి చికెన్‌గున్యా పాజిటివ్ కేసులు నమోదు కావడం కలకలం రేపింది. ఒకేసారి 10 కేసులు రావడంపై వైద్యాధికారులు ప్రజల్లో ఆందోళన మొదలైంది. వాస్తవానికి చికెన్‌గున్యా వ్యాధి దోమల వల్ల వస్తుంది. ఎండాకాలం కావడంతో గ్రామంలో దోమలే లేవని ఎలా ఈ కేసులు వచ్చావో అర్థంగాక వైద్యాధికారులు తలలు పట్టుకుంటున్నారు. సోమవారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన 60 ఏళ్ల యంకమ్మ కర్నూలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. వైద్యులు మాత్రం రోగి బ్యాక్టీరియా మెనింజైటిస్‌తో బాధపడుతూ మరణించిందని, ఈ కేసు చికెన్‌గున్యా కాదని వైద్యఆరోగ్య శాఖ అధికారులు తెలియజేశారు. ఇదే గ్రామానికి చెందిన 50ఏళ్ల పెద్ద శేఖన్న కర్నూలు జీజీహెచ్‌లో కీళ్ల నొప్పులు, తీవ్ర ఆయాసంతో బాధపడుతున్నారు. కలపరి గ్రామంలో విషజ్వరాలు, చికెన్‌గున్యా కేసులు నమోదు కావడం ఈ వ్యాధులు అదుపులోకి రాకపోవడంతో రాష్ట్ర వైద్యాధికారులు సీరియస్ అయినట్లు సమాచారం. దీంతో గ్రామంలో పరిస్థితిని అంచనా వేయడానికి మంగళవారం స్టేట్ వైద్యాధికారులు రానున్నారు.

వైద్య శిబిరం : కలపరి గ్రామంలో విషజ్వరాలు గ్రామంలో ప్రబలడంతో నాలుగు రోజులుగా వైద్యురాలు దుర్గబాయి వైద్యబృందంతో శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నారు. గ్రామంలో డీఎల్‌పీవో వీరభద్రప్ప పర్యటించి పలు మురుగు కాలువలు, వీధులలో దోమలు నివారణకు స్ప్రే చేసి, పారిశుధ్య పనులు చేపట్టారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



భక్తురాలికి స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

మహానంది, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో భక్తుల కోసం దేవస్థానం అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆత్మకూరుకు చెందిన పోగుల లక్ష్మీదేవి రూ.లక్ష విరాళం అందచేసినట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం దేవస్థానం పరిపాలన భవనంలో దాతకు స్వామి వారి ప్రసాదాలు, శాలువాతో సన్మానించారు. అనంతరం ఈవో మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో యర్రమల్ల మధు, క్యాషియర్ నాగభూషణంతో పాటు అన్నదానం ఇన్‌చార్జి రామశివ పాల్గొన్నారు.

నేడు ఎంపీ శబరి రాక

కొత్తపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమల అటవీ సమీపంలో ఉన్న సిద్దేశ్వరం, జానాల గూడెం, బలపాలతిప్ప గ్రామాలకు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మంగళవారం రానున్నట్లు స్థానిక టీడీపీ నాయకులు తెలిపారు. గత 40 ఏళ్లుగా చిమ్మచీకటిలో ఉన్న ఈ గూడెలకు ఎస్టీ సబ్ ప్లాన్ కింద సుమారు రూ.95 లక్షల నిధులతో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మూడు గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడంతో వాటిని ప్రారంభించేందుకు బైరెడ్డి శబరి మంగళవార ఉదయం 11 గంటలకు రానున్నారని టీడీపీ నాయకులు తెలిపారు. ముందుగా ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభించిన అనంతరం సప్తనదుల సంగమేశ్వరాన్ని, కొలనుభారతి అమ్మవారిని కూడా దర్శించుకోనున్నారనీ టీడీపీ నాయకులు వెల్లడించారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

ఆత్మకూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో పరిధిలోమంగళవారం ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వినయ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ. ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలో ఆర్టీసీ సంస్థల సేవల్లో నెలకొన్న లోపాలు, మెరుగైన సలహాలు, సూచనలు తెలిపేందుకు ఫోన్ 9959225801 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాన్యం వేలం

కొత్తపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో వెలసిన తాండవ మల్లేశ్వరస్వామి ఆంజనేయస్వామి దేవాలయాలకు చెందిన మాన్యం వేలం పాటలో రూ.6.37 లక్షల ఆదాయం దేవదాయశాఖకు వచ్చినట్లు ఆలయ ఈవో కార్తీక్ తెలిపారు. సోమవారం తాండవ మల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా ఈ ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. ఉభయ దేవాల యాలకు సంబంధించిన 58 ఎకరాల మాన్యాన్ని గతేడాది వేలం పాట నిర్వహిం చగా.. 5.60 లక్షల ఆదాయం మాత్రమే లభించిందని చెప్పారు. ఈ ఏడాది వేలం పాటలో అదే 58 ఎకరాల మాన్యం భూమికి అదనంగా రూ. 77,500 ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు. మొత్తం ఈ ఏడాది వేలం పాటలో రూ.6,37,500 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలి పారు. పోలీసులు బందోబస్తు నిర్వహించినట్లు ఈవో వెల్లడించారు.

'ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి'

ఆత్మకూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బింగిమళ్ల శ్యామ్‌సుందర్ గుప్తా, గౌరవాధ్యక్షులు ఖండే శ్యామ్‌సుందర్‌లాల్ పిలుపునిచ్చారు. ఆత్మకూరులోని వాసవీ భవన్‌లో ఆత్మకూరు మండల ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గౌరవాధ్యక్షులుగా ఇస్కాల రమేష్, శేగు వేణుగోపాల్, దొంతు నరేష్, అధ్యక్షుడిగా శేగు కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా రాజా వెంకటరమణ, పాలాది విజేయుడు, కొప్పరపు రవిప్రసాద్, గొల్ల శ్రీను, రామమడుగు మురళీకృష్ణ, మంగలూరు వెంకటేష్, పోతుగంటి ఆనంద్, బండారు రామచంద్రుడు, అత్తులూరు శ్రీధర్‌గుప్తా ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా గొల్ల సత్యం, దొంతు సురేష్, సహ కార్యదర్శులుగా పుల్లాడి పవన్, మొగిల్లపల్లి దామోదర్, గుటూరి సుమన్, కొల్లూరు రాజు, పాలాది సాగర్, పెసల రాంబాబు, ఈపూరి సందీప్, అత్తులూరి రాజేష్‌లతో పాటు ఈసీ మెంబర్లను, కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ పెద్దలకు ఘనంగా సత్కరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు బొగ్గరపు జనార్దన్, ఆత్మకూరు పట్టణాధ్యక్షులు నరహరి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఏపీపీఎస్ఏ మహిళా విభాగం
రాష్ట్ర అదనపు జనరల్ సెక్రటరీగా మాధవీలత

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ మహిళ విభాగం అదనపు జనరల్ సెక్రటరీగా నంద్యాల రవీంద్ర హైస్కూల్ కరస్పాండెంట్ మాధవీలత ఎంపికయ్యారు. నూతనంగా ఏర్పడిన మహిళా విభాగానికి ఎంపికైన వారికి విజయవాడలోని విధాన్ ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు ప్రమాణ స్వీకారం చేయించి నియామక పత్రాలను అందజేశారు. మాధవీలతను నంద్యాల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులతో పాటు శాంతిరామ్ సంస్థల చైర్మన్ మిద్దెశాంతిరాముడు, న్యాయవాది రామచంద్రారావు, వర్ధంశెట్టిరాజారామ్, ఏవీఆర్ ప్రసాద్ తదితరులు అభినందించారు.

టీడీపీ కార్యకర్తకు నివాళి

పాణ్యం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పాణ్యం ఎస్సీ కాలనీకి చెందిన సీనియర్ టీడీపీ కార్యకర్త నెరవాటి కొత్తూరు (57)మృతి చెందడంతో ఆ పార్టీ నాయకులు నివాళి అర్పించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎంపీటీసీ రంగరమేష్, నాయకులు ఖాదర్‌బాషా, రామ్మోహన్‌నాయుడు, మార్కెట్ యార్డు డైరెక్టర్ ప్రభాకర్, సుబ్బయ్య కుమార్‌రెడ్డి, వెంకటాద్రి పాల్గొన్నారు.

'హిందూ శ్మశానానికి హద్దులు గుర్తించాలి'

పాణ్యం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పాణ్యంలోని గోరుకల్లు రస్తా వైపునుంచే హిందూ స్మశాన వాటికను సర్వే చేసి హద్దులు గుర్తించాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. సోమవారం ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఎన్ఎస్‌యూఐ నాయకులు ప్రతాప్ మాట్లాడుతూ శ్మశానం ఆక్రమణకు గురైందన్నారు. ప్రభుత్వం కేటాయించిన భూమికంటే తక్కువగా ఉందన్నారు. వందేళ్లుగా ఉన్న ఈ శ్మశాన వాటిక ఆక్రమణకు గురవ్వడంతో స్మశానంలో మృతదేహాలకు అంత్యక్రియలు చేసుకోవడానికి ఇబ్బందిగా ఉందన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణాసంస్థలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఐటీఐలో చేరే విద్యార్థులు నేటి నుంచి మే 24వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఏప్రిల్ 29వ తేదీ నుంచి మే 26వ తేదీ సాయంత్రం ఐదుగంటల లోపు సర్టిఫికెట్‌లను వెరిఫికేషన్ చేసుకోవాలని తెలిపారు. వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులు జూన్ 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీలలో జోన్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జరుగు కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని, 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మార్గదర్శకాలను అన్వేషించాలి: కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పీ-4సర్వే ద్వారా గుర్తించిన 43,021 బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు మార్గదర్శకాలను అన్వేషించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్నతస్థాయి వ్యక్తులను గుర్తించి మార్గదర్శులుగా నమోదు చేయాలని మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలను ఆదేశించారు. జిల్లా అధికారులు కూడా మార్గదర్శ కుటుంబాలను స్ఫూర్తిగా తీసుకొని బంగారు కుటుంబాలకు చేయూతనివ్వాలని సూచించారు. అందులో భాగంగానే రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు, సభ్యులు చెంచుకుటుంబాలను ప్రోత్సహించేందుకు ముందుకువచ్చారని తెలిపారు. జిల్లా కేంద్రంలో కెనాల్ కాంపౌండ్‌లోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయ ఆవరణలో రక్తనిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీలో రూ.వెయ్యి చెల్లిస్తే జీవితకాల సభ్యత్వం ఉంటుందన్నారు. జిల్లా అధికారులందరూ శాశ్వత సభ్యత్వం పొందాలని కోరారు. ఆప్కాస్‌కు సంబంధించి ఒప్పంద ప్రాతిపదికన సిబ్బందిని నియమించుకోవడానికి అధికారులు నేరుగా ఫైల్‌ను జిల్లా ఇన్‌చార్జి మంత్రికి పంపుతున్నారని అలాకాకుండా తననుంచి ఫైల్ పంపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

- కిశోర్ వికాసం ప్రత్యేక కార్యక్రమంపై అవగాహన కల్పించి బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టిగా కృషిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. మే 2వ తేదీనుంచి జూన్ 12వరకు 12రకాల థీమ్స్‌తో కిశోర్ వికాసం ప్రత్యేక కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లో నిర్వహించాలని ఆదేశించారు.
- ఉపాధి వేతనదారులకు లక్ష పనిదినాలు కల్పించాలని కేటాయించిన లక్ష్యాలపై ప్రత్యేకదృష్టి సారించాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం కమాండ్ కంట్రోల్‌రూమ్‌లోని ఎన్ఐసీ వీడియోకాన్ఫరెన్స్ హాల్‌లో ఉపాధిహామీ లక్ష్యాలపై వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

నేషనల్ ఎలిజిబులిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) యూజీ పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సెంటినరీ హాల్‌లో నీట్ పరీక్ష నిర్వహణపై అధికారులతో సమీక్షాసమావేశం ఆమె నిర్వహించారు. మే 4వ తేదీన జరిగే నీట్ పరీక్షకు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల, టెక్కెలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తదితర కళాశాలలను పరీక్షాకేంద్రాలుగా ఏర్పాటు చేశామని, ఈ పరీక్షకు 1172మంది విద్యార్థులు హాజరవుతున్న నేపథ్యంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యార్థులను ఉదయం 11నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో మెడికల్ క్యాంప్‌లు, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు, తాగునీటి వసతి కల్పించాలన్నారు. కేంద్రాల్లో అవసరమైన టేబుళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షాకేంద్రాలవద్ద 144సెక్షన్ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

మంత్రితో టీడీపీ పరిశీలకుడి భేటీ



మంత్రి ఫరూక్‌తో అబ్జర్వర్ రవికుమార్

నంద్యాల రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్‌తో పార్టీ నంద్యాల అబ్జర్వర్ పోతురాజు రవికుమార్ సోమవారం భేటీ అయ్యారు. పార్టీ కార్యక్రమాల గురించి చర్చించారు. అనంతరం అబ్జర్వర్ రవికుమార్ మాట్లాడుతూ కుటుంబ సాధికార సారధి వ్యవస్థను సీఎం చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని చెప్పారు.

'ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'



మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల పట్టణానికి 278 నూతన పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. మైనార్టీ స్వయం ఉపాధి కోసం సబ్సిడీ రుణాల కోసం రూ.342 కోట్ల రూపాయలు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. వైసీపీ హయాంలో స్వయం ఉపాధికి సంబంధించి ఒక్క సబ్సిడీ రుణాన్ని కూడా అందించకుండా మైనార్టీలను దగా చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కౌన్సిలర్లు, 42 వార్డులు ఇన్‌చార్జిలు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం పెంపుపై హర్షం



కొబ్బరి కాయలు సమర్పిస్తున్న క్షురకులు

సున్నిపెంట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రముఖ దేవస్థానాలలో కల్యాణ కట్టలో పని చేస్తున్న క్షురకులకు గౌరవ వేతనం నెలకు రూ.20 వేల నుంచి రూ.25 వేల పెంచిన సందర్భంగా శ్రీశైలంలోని క్షురకులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు ఉండవల్లి శ్రీనివాసరెడ్డి, కేవీ రమణ సమక్షంలో ఆలయప్రధాన ద్వారం వద్ద 108 కొబ్బరి కాయలు సమర్పించారు. ఏపీ నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమార్ సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు సాయిబాబా, రమణ, స్థానిక నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.

అలరించిన 'గురురాజా' విద్యార్థుల నృత్య ప్రదర్శన



విద్యార్థినులను అభినందిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): విజయవాడ న్యూ కన్వెన్షన్ హాల్‌లో సత్యకాలం పుస్తకావిష్కరణలో నంద్యాల కు చెందిన గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థుల, జాతీయత, దేశభక్తి ప్రతిబింబించే శాస్త్రీయ నృత్య ప్రదర్శన అతిథులను ఆహూతులను అబ్బురపరిచింది. నృత్యప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జ్ఞాపిక అందజేసి అభినందించినట్లు యాజమాన్యం తెలిపింది. స్కూల్ డైరెక్టర్ షేక్షావలిరెడ్డి పాల్గొన్నారు.

మహానందిలో కలెక్టర్ దంపతులు

మహానంది, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో సోమవారం ఉదయం కలెక్టర్ రాజకుమారి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపం వద్ద వీరికి ఈవో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో కలెక్టర్ దంపతులు స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలు నిర్వహించారు. కల్యాణ మండపంలో వీరిని వేద పండితులు ఆశీర్వదించారు. ఆలయ ఈవో శాలువాతో సన్మానించి, స్వామి చిత్రపటాన్ని అందజేశారు. వీరి వెంట ఏఈవో యర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య పాల్గొన్నారు.

'కౌన్సెలింగ్ మాన్యువల్‌గా నిర్వహించాలి'

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎస్జీటీ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులకు సంబంధించి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రామచంద్రారెడ్డి, శివయ్య, జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ ఎనిమిదేళ్ల పనిచేసిన ఒక ఎస్జీటీ ఉపాధ్యాయుడు వెయ్యి నుంచి 1500 ఐచ్ఛికాలు ఇవ్వాల్సి ఉంటుందని, ఆ సమయంలో సర్వర్ పనిచేయకపోవడం, ఉపాధ్యాయులకు వాటిపైన అవగాహన లేకపోవడం, వివిధ మండలాల్లో గ్రామాల పేర్లు తెలియకపోవడం వల్ల నష్టం కలుగుతుందని అన్నారు.

పార్టీ కోసం పని చేసిన వారికి ప్రాధాన్యం

- నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు ప్రాధాన్యం ఉంటుందని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తప్పకుండా అవకాశం ఉంటుందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో టీడీపీ నందికొట్కూరు విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. ఎమ్మెల్యేతో పాటు పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు దేవళ్ల మురళి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని బూత్‌లలో కుటుంబ సాధికార సారధులను నియమించి, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని సూచించారు. తద్వారా పార్టీ బలోపేతం అవుతుందన్నారు. దేవళ్ల మురళి మాట్లాడుతూ నందికొట్కూరులో గత ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి 20 ఏళ్ల క్రితం నాటి చరిత్రను తిరగరాశామన్నారు. అందుకు నాయకుడు మాండ్ర శివానందరెడ్డి సూచనలు, కార్యకర్తల అనుసరణే కారణమని ఆయన న్నారు. నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, టీడీపీ నాయులు ముర్తుజావలి, పలుచాని మహేశ్వర రెడ్డి, గిరీశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

పాములపాడు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్ర నియమాలు పాటించాలని ఎస్ఐ సురేశ్‌కుమార్ సూచించారు. సోమవారం పాములపాడులో కేజీ రోడ్డుపై వాహనాలను తనిఖీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపకూడదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలను నడపకూడదన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

వెలుగోడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ఇష్టపడి చదవాలని టీడీపీ నాయకులు కలాం, జాకీర్‌హుస్సేన్, ఎంఈవో బ్రహ్మం నాయక్ సూచించారు. సోమవారం వెలుగోడు గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి సమలత ఆధ్వర్యంలో సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం ప్రారంభించారు. పదో తరగతిలో 596 మార్కులు సాధించిన డీల్ పాఠశాల విద్యార్థిని సాయిస్ఫూర్తిని, 591 మార్కులు సాధించిన నిలిచిన లిటిల్ ఏంజిల్ పాఠశాల విద్యార్థిని శరణ్యలకు మెమెంటోలు అందించి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లిటిల్ ఏంజిల్ పాఠశాల నిర్వాహకులు ఇమ్మానుయేలు, అమీర్‌హంజా, విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై నిరసన



నంద్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ నంద్యాల న్యాయవాదులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ కార్యాలయం నుంచి నంద్యాల రెండవ పట్టణ సర్కిల్ వరకు నల్లకోటు ధరించి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.హుస్సేన్ బాషా, కార్యదర్శి ఎంఆర్ కృష్ణారెడ్డి, కార్యవర్గం ఆధ్వర్యంలో న్యాయవాదులంతా ర్యాలీగా చేరుకున్నారు. ర్యాలీలో పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీలో సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.



కరివేనలో ర్యాలీ చేస్తున్న గ్రామస్థులు

ఆత్మకూరు రూరల్: కశ్మీర్‌లోని పహల్గామ్ బైసారంలో ఉగ్రవాదులు పర్యాటకులను చంపడం అమానుషమైన ఘటన అని, ఉగ్రదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కరివేన గ్రామ నాయకులు శరత్ బాబు, శ్రీనివాసరావు ప్రభాకరరావు, సురేష్, పుల్లయ్య ఆచారి, నాగశేషయ్య ఆచారి అన్నారు. సోమవారం కరివేన గ్రామంలో కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు

'మాతృశాఖలో విలీనం చేయాలి'



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యాన సహాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మాతృశాఖలో తమను విలీనం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరుతూ గ్రామీణ ఉద్యాన సహాయకులు నంద్యాల జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. గ్రామీణ ఉద్యాన సహాయకులు మాట్లాడుతూ వ్యవసాయశాఖ కంబంధ హస్తాల నుంచి తమను కాపాడాలని కోరారు. పేరుకు తాము ఉద్యాన సహాయకులైనప్పటికీ తమపై పెత్తనమంతా వ్యవసాయశాఖ అధికారులదేనని అన్నారు. తమకు వ్యవసాయశాఖ పనులు అప్పగించడంతో ఉద్యాన రైతులకు పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతున్నామని, ఆరేళ్లుగా ఎలాంటి పదోన్నతులు, బదిలీలు లేవని అన్నారు. అధిక ఒత్తిడికి గురవుతూ తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందదని ఆవేదన వ్యక్తం చేశారు.

'అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

పగిడ్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శాసనసభ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పైఅనుచిత వ్యాక్యలు చేసి అసభ్యకరంగా దూషించడం సరికాదని సీపీఎం మండల కన్వీనర్ పక్కీర్‌సాహెబ్ అన్నారు. పగిడ్యాలలో సోమవారం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో 40 ఏళ్లుగా ఉంటున్న పేద కుటుంబాల ఇళ్లను రఘురామకృష్ణరాజు కూల్చివేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించి నెల రోజులలోపు వారికి న్యాయం చేయలని డిమాండ్ చేసిన సీపీఎం నాయకుడు శ్రీనివాసరావుపై దుర్భాషలాడటం తగదన్నారు. రఘురామకృష్ణరాజు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు గంధం ఉసేనమ్మ, నాగన్న, పుల్లన్న, అంజి తదితరులు ఉన్నారు.

వక్ఫ్ చట్ట సవరణపై నిరసన

నంద్యాల రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా మౌన నిరసన చేస్తున్నట్లు నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మౌలానా అబ్దుల్లా సేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని డబ్రా మసీదులో ఆయన మాట్లాడుతూ వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగ ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు మార్గదర్శకత్వంలో దేశవ్యాప్తంగా శాంతియుత నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ఒత్తిగుల్ పత్తతిలో జరిగే ఈకార్యక్రమంలో భాగంగా ఈనెల 30వతేదిన రాత్రి గంటల 9 నుంచి 9.15 నిమిషాల వరకు ఇళ్ల, దుకాణాలు, ఫ్యాక్టరీలలో విద్యుత్తును ఆర్పివేసి నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. ముస్లిం జేఏసీ గౌరవ అధ్యక్షుడు అబులైస్, కో కన్వీనర్ మస్తాన్, ఎజాస్ హుస్సేన్, ఇన్సాఫ్ అధ్యక్షుడు బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీల విరాళం

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కెనరాబ్యాంక్ అధికారులు కలెక్టరేట్‌కు రెండు ఏసీలు, 5వాటర్ డిస్పెన్సర్లు సోమవారం అందజేశారు. కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్ సమక్షంలో బ్యాంక్ అధికారులు పరికరాలను అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక బాధ్యత కింద బ్యాంక్ అధికారులు పరికరాలను అందజేయడం అభినందనీయమన్నారు. వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా కలెక్టరేట్‌లోని విజిటర్స్ లాబిన్‌లో ప్రజలకు వేసవి తాపాన్ని తగ్గించేందుకు ఒక టవర్ ఏసీతో సాధారణ ఏసీని కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పీజీఆర్ఎస్ హాల్‌లో అర్జీదారుల దాహార్తిని తీర్చేందుకు 5వాటర్ డిస్పెన్సర్లను వినియోగించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. డీఆర్వో రామునాయక్, కర్నూలు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామచంద్ర, నంద్యాల కెనరాబ్యాంక్ చీఫ్ మేనేజర్లు సుబోధ్, అనంత్, రాకేష్‌రంజన్, కర్నూలు బ్రాంచ్ డివిజనల్ మేనేజర్ సురేష్‌కుమార్, నంద్యాల మెయిన్‌బ్రాంచ్ ఆఫీసర్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన వర్మకు ఘన నివాళి

ఆత్మకూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సుదర్శనవర్మ 57వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అచారు. అనంతరం సీపీఎం నాయకులు రణధీర్, స్వాములు మాట్లాడుతూ వెలుగోడు ప్రాంతంలో దున్నేవాడికే భూమి కావాలని భూస్వాములను ఎదురించి పేదలకు భూములు పంచిన గొప్ప వ్యక్తి సుదర్శనవర్మ అని కొనియాడారు. ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉండటంతో 1968లో భూస్వామ్యగుండాలు సుదర్శనవర్మను అతిదారుణంగా హత్య చేశారని తెలిపారు. నాయకులు రామ్‌నాయక్, వీరన్న, ఇస్మాయిల్, మహ్మద్, గణపతి, బొల్లు ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వెలుగోడు: సుదర్శనశర్మ, నాగిరెడ్డి ఆశయ సాధన కోసం పాటు పడదామని సీపీఎం నాయకులు రాజశేఖర్, నాగేంద్రుడు, మాజీ ఎంపీపీ ఎల్లాల కృష్ణుడు అన్నారు. వెలుగోడు సర్పంచ్‌గా పనిచేసిన సుదర్శన వర్మ, అబ్దుల్లాపురం సర్పంచ్‌గా పనిచేసిన నాగిరెడ్డిల వర్ధంతిని వారి సమాధుల వద్ద నిర్వహంచారు. రవికుమార్, నాగమోహన్, వెంకటయ్య, కిశోర్, ఎర్రబాషా, నబిరసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతి

నందికొట్కూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న బాలీశ్వరుడు అనారోగ్య కారణంగా సోమవారం మృతి చెందారు. ఆయన భౌతికాయానికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్‌లు పూలమాల వేసి నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. టీడీపీ నాయకులు పలుచాని మహేశ్వర్‌రెడ్డి, సంపత్ కుమార్ యాదవ్, శంకర్ తదితరులు నివాళి అర్పించారు.

సీహెచ్‌వోల నిరవధిక సమ్మె



సమ్మె చేస్తున్న సీహెచ్‌వోలు

నంద్యాల హస్పిటల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో ఎన్‌హెచ్‌ఎం కింద పనిచేస్తున్న సీహెచ్‌వోలు నంద్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె ప్రారంభించారు. గత రెండేళ్లుగా జీతభత్యాల విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాలకు ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో తమ డిమాండ్ల సాధనకోసం నిరసన కార్యక్రమం చేపట్టామని వారు చెప్పారు. ఆరేళ్లు దాటిన సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని, ఎన్‌హెచ్‌ఎంలో ఇతర ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ప్రతినెలా జీతంతోపాటు ఇన్సెంటివ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం 5శాతం ఇంక్రిమెంట్, ఆర్థికపరమైన సమస్యలు తీర్చేవిధంగా హామీలు ఇవ్వాలని ఏపీఎంసీఏ జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గురు ప్రసాద్, ఉపాధ్యక్షుడు భాస్కర్, సంయుక్త కార్యదర్శి అఖిల్, కోశాధికారి వెంకట భార్గవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సౌందర్య, హరిక పాల్గొన్నారు.

సిబ్బందికి శిక్షణ

సున్నిపెంట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ప్రైవేట్ భద్రతా సిబ్బందికి ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తునట్లు దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రంలో భద్రతా సిబ్బంది భక్తులతో ఎలా మెలగాలి? తదితరు అంశాలపై అవగాహన కల్పించారు. శ్రీశైలం సీఐ జి.ప్రసాదరావు, దేవస్థానం సీఎస్‌వో అయన్న, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్ పాల్గొన్నారు.

డిమాండ్లను నెరవేర్చాలి : ఎన్‌ఎంయూ



బనగానపల్లె డిపో ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు

బనగానపల్లె, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నా యకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో కార్యాలయ ఆవరణంలో తమ డిమాండ్లను నెరవేర్చాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అసోసియేషన్ యూనియన్ నాయకులు రిలే నిరసన దీక్షలు చేపట్టారు. యూనియన్ నాయకుడు జమ్ములయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను అమలు చేయాలని, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణకు సెలవులు మంజూరు చేయాలని, గ్యారేజీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, పదోన్నతులు వెంటనే ఇవ్వాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాయుడు, డీవీ.సుధామణి, సుమలత, మల్లికార్జున, మజీద్, నాగేశ్వర్లు, కె.శ్రీనివాసులు, భూషణం, రాష్ట్ర ఉపకార్యదర్శి ఇద్రావతి, డిపో సెక్రటరీ శ్రీనివాసులు, గ్యారేజీ అధ్యక్షుడు లక్ష్మన్న, సెక్రటరీ దేవేంద్రరెడ్డి, ఓబులేసు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రిలే దీక్షల్లో నాయకులు ఓబులేసు, నారాయణ, రావు, సీహెచ్‌ఎన్ రాజు, బీఆర్ ఆంజనేయులు, కేయం రాజా, ఎస్.జాకీర్‌హుసేన్, స్వాములు, కె.ఓబన్న, నరసింహులు, పుల్లారెడ్డి, రాముడు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపోలో ఎన్‌ఎంయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రిలేనిరాహార దీక్షలు ప్రారంభించారు. కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నాయకులు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలి



కార్యకర్తలతో మాట్లాడుతున్న తమ్మినేని నటేశ్ చౌదరి

బనగానపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తమ్మినేని నటేశ్ చౌదరి అన్నారు. సోమవారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో మండలస్థాయి టీడీపీ బూత్, క్లస్టర్లు, యూని ట్లు, మండల నాయకుల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని నటేశ్ చౌదరి మాట్లాడుతూ త్వరలో రానున్న స్థానిక సంస్థలను దృష్టిలో పెట్టుకొని పార్టీని బలోపేతం చేయాల్సిన బా ధ్యత బూత్, క్లస్టర్, యూనిట్, మండల టీడీపీ నాయకులదే అన్నారు. ప్రతి టీడీపీ కార్యకర్త తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథ కాలు ప్రజల్లోకి తీసుకవెళ్లాలని సూచించారు. సమావేశంలో టీడీపీ బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం

బేతంచెర్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ శేషారెడ్డి సామాజిక ఆరోగ్య కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులు, మహిళలకు, రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సురా మధుసుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చిన రోగులకు మధు కుమార్ సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ సేవ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వలిభాషా, మారం పవన్ కుమార్, మధు, కేశవనాయుడు, వైద్యసిబ్బంది ఉన్నారు.

ఉమామహేశ్వర స్వామికి పల్లకీ సేవ

బనగానపల్లె, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండ లంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి క్షేత్రంలో పల్లకీ సేవ ఉత్సవాలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పల్లకీసేవలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు స్వామివారి పల్లకిని మోశారు. కార్యక్రమంలో ఈవో చంద్రుడు, పాత పాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, యాగంటిపల్లె మౌళీశ్వరరెడ్డి, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



స్వామివారి పూజలు చేస్తున్న అర్చకులు

ఖాజాహుసేన్ మృతి బాధాకరం

బనగానపల్లె, ఏప్రిల్ 28(ఆంధ్ర జ్యోతి): పట్టణం లోని ఖాజీవాడ మసీద్ మౌజమ్ అ మాలి ఖాజా హుసే న్ అనారోగ్యంతో మృతి చెందడం బా ధాకరమని మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. సోమ వారం ఖా జాహుసేన్ మృతదేహానికి ఆయన నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మహా కుంభాభిషేక ఉత్సవాలకు ఆహ్వానం

బనగానపల్లె, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మే 4నుంచి 8వరకు వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి దేవస్థానంలో మహాకుంభాభిషేక వజ్రోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం పెద్దలు తెలిపా రు. సోమవారం మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిని కలిసి ఆహ్వాన పత్రి కను అందజేశారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల మండి మర్చంట్ అసోసి యేషన్ అధ్యక్షుడు ఇస్కాల ప్రసాద్, జిల్లా ఆర్యవైశ్యసంఘం ఉపాధ్య క్షుడు పెండేకంటి నాగరాజు, గౌరవ సలహాఅధ్యక్షులు కాల్వకార్తీక్, నాగ య్య, కల్నాటి అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిన నీరు ..

- వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో వర్షపు నీరు నిలిచింది. దాంతో ఇటు వాహన చోదకులు, అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు సోమవారం ఎదుర్కొన్నారు. ఆదివారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షం కార ణంగా ప్రధాన రహ దారిలో పెద్ద ఎత్తున నీరు నిలిచింది. అనంతపూర్-అమరావతి ప్రధాన రహదారిలో స్టేట్ బ్యాంకు, పోలీస్ స్టేషన్ ఎదురుగా, రోడ్డుకు ఇరు వైపులా డ్రైనేజీ లేక పోవడం సమస్యగా మారింది. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించాలని వాహనదారులు కోరారు.



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మండుటెండలో ఊరట

- పశువుల కోసం గ్రామాల్లో నీటి తొట్లు
- రూ.లక్షలు వెచ్చించి నిర్మాణాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు, పశువుల కాపర్లు

ప్యాపిలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న నీటి తొట్లతో మూగ జీవాల దాహార్తి తీరుతోంది. తొట్ల నిర్మాణాలతో పశువుల తాగునీటి కష్టాలు తీరడంతో రైతులు, గొర్రెల కాపర్లు, పాడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో దాదాపు 35 గ్రామాల్లో ప్రభుత్వం నీటి తొట్ల నిర్మాణాలను చేపట్టింది. ఇందులో 30తొట్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన తొట్లు కూడా తుది దశలో ఉన్నాయి. మండలంలోని ప్యాపిలి, ఏనుగమర్రి, వెంగళాంపల్లి, చిన్నపూదిళ్ల, పెద్దపూ దిళ్ల, మునిమడుగు, ఊటకొండ తదితర గ్రామాల్లో అధికారులు నీటి తొట్లను ఏర్పాటు చేశారు. ఈ తొట్లకు గ్రామపంచాయతీ బోర్ల ద్వారా నీరు నింపుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఒక్కో తొట్టికి రూ.30 వేల నుంచి..

పశువుల దాహం తీర్చేందుకు ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి తొట్లను ఏర్పాటు చేసింది. ఒక్కో తొట్టికి దాదాపు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అధికారులు తొట్లను నిర్మించారు. తొట్ల నిర్మాణాల కోసం మండలంలో దాదాపు రూ.15లక్షలు వెచ్చించినట్లు జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీవో రవీంద్ర తెలిపారు.

కష్టాలన్నీ తొలగాయి..

వేసవిలో పశువుల దాహం తీర్చాలంటే రైతులు ఇబ్బందులకు గురయ్యేవారు. కిలోమీటర్ల దూరంలో ఉన్న చెరువులు, కుంటల దగ్గరకు వెళ్లాల్సి వచ్చేది. కొన్ని గ్రామాల్లో చెరువుల్లో కూడ చుక్క నీరులేదు. దీంతో రైతులు పశువులకు నీరు తాపాలంటే తంటాలు పడేవారు. అయితే ప్రభుత్వం పశువులకు నీటి తొట్లు ఏర్పాటు చేయడంతో కష్టాలన్నీ తొలిగాయి. దీంతో రైతులు, గొర్రెల కాపర్లు, పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మునిమడుగులో తొట్టిలో నీరు తాగుతున్న మేకలు

ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలి

కోవెలకుంట్ల, ఏప్రిల్ 28 (ఆంధ్ర జ్యోతి) : ఉగ్రవాదు లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోవె లకుంట్ల న్యాయవా దులు కోరారు. సోమవారం కోర్టు విధుల ను బహిష్కరించి ఉగ్రదాడిలో మృతి చెందిన కుటుంబాలకు సంతాపాన్ని తెలిపారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. బాధిత కు టుంబసభ్యులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసో సియేషన్ ప్రెసిడెంట్ ఎం.ఓబులేసు, వైస్ ప్రెసిడెంట్ దారా శేఖర్, కో శాధికారి చంద్రుడు, సీనియర్ న్యాయవాదులు నరసింహులు, తిరుప తయ్య, డి.శ్రీని వాసులు, నాగశేషులు, రాజశేఖర్, రమేశ్ పాల్గొన్నారు.



కోవెలకుంట్లలో కోర్టు విధులు బహిష్కరించి నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

డోన్ టౌన్: కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడులను డోన్ బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. సోమవారం బార్ అసోసియేసన్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ నాయుడు, కార్యదర్శి ఎన్.పెద్దయ్య, వైస్ ప్రెసిడెంటు కేజీ చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ జే.రవిమోహన్, బార్ అసోసియేషన్ సభ్యులు డోన్ కోర్టు ముందు ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదులనుల ఏరివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లేడి రిప్రజెంటేటివ్ మీనిగ కుమారి, సీనియర్ న్యాయవాదులు శేషశయణరావు, జే.శ్రీనివాసుల శెట్టి, జేబీవుల్లా, కుడిమెట్ల నారాయణ, పుల్లయ్య, మదనగోపాల్, శివరామకృష్ణ, మధుసూదన్ రెడ్డి, కుళ్లాయి, మదనశేఖర్, నబీషా, గోపాల్, మహిళా న్యాయవాదులు సైదాన్‌బీ, హీనాభేగం పాల్గొన్నారు.



డోన్‌లో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

రైతులను ముంచిన అకాల వర్షం

- గాలి వాన బీభత్సంతో దెబ్బతిన్న ఉద్యానవన పంటలు



కొలిమిగుండ్ల: పడి పోయిన అరటి చెట్లు



రుద్రవరంలో వరి ధాన్యంపై పట్టలు కప్పుతున్న రైతులు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం రాత్రి నుంచి కురిసిన అకాల వర్షం రైతులను నిండా ముంచింది. గడిచిన 24గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా కొలిమిగుండ్ల మండలంలో 48మి.మీ వర్షపాతం నమోదైంది. గాలి వాన బీభత్సం కారణంగా ఉద్యానవన పంటలు సాగుచేసిన రైతులు తీవ్రంగా దెబ్బ తిన్నారు. మండలంలోని మదనంతపురం, చింతలాయపల్లె, అబ్దులాపురం, కోరుమానుపల్లె తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన అరటి తోటలు నెల కొరగడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు 100ఎకరాల్లో అరటి, చీనీ తోటలు దెబ్బతినడంతో లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లినట్లు అన్నదాతలు వాపోతున్నారు. చేతికందిన చీనీ కాయలు రాలిపోయాయి. అరటి దిగుబడి సమయంలో ఈదురుగాలుల కారణంగా మొత్తం చెట్లు నెల కొరిగాయని రైతులు వాపోతున్నారు. అకాల వర్షం అన్నదాతలను నిండా ముంచిందని ఆవేదన వ్యక్తంచేశారు.

రుద్రవరం : మండలంలో సోమవారం సాయంత్రం చినుకులురాలాయి. దాంతో రైతులు ధాన్యం తడిచిపోతుందని కుప్పలపై పట్టలు కప్పారు. మొన్నటి వర్షానికి వరి, మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు.

'విషపూరిత ద్రవాల విక్రయాలను అడ్డుకోవాలి'

సంజామల,ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : విషపూరిత ద్రవాల విక్రయాలను అడ్డుకోవాలని తహసీల్దార్ అనిల్ కుమార్ ఆదేశించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇళ్ల ముందు పేడ నీళ్లతో కల్లాపు చల్లేవాళ్లని, ప్రస్తుతం పేడ రంగును దుకాణాల్లో విక్రయిస్తున్నారన్నారు. అది విషపూరితం కావడం చాలా మంది ఆ ద్రావం తాగి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం పేడ రంగును నిషేధించిందన్నారు. మండల వ్యాప్తంగా పేడరంగు విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నాని ఆదేశించారు. అలాగే ఎన్‌టీఆర్ గృహాలకు సంబందించి ఇంటి పొజిషన్ సర్టిఫికెట్లతో పాటు క్యాస్ట్ , ఇన్‌కం సర్టిఫికెట్లు వేగవంతంగా లబ్ధిదారులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తులసి కృష్ణ, సర్వేయర్లు మల్లేశ్వరి, క్రిష్ణయ్య, వీఆర్‌వోలు, ఎరుకలయ్య, సుబ్బరాయుడు, నరసింహా రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మండల టాపర్‌కు సన్మానం

ప్యాపిలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జలదుర్గం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జగదీష్ పది పరీక్షల్లో 575 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. దీంతో గ్రామస్థులు సోమవారం విద్యార్థికి సన్మానించారు. కార్యక్రమంలో రసూల్, రంగస్వామి, రవి, గోపాల్, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్యాపిలి వాసి మృతి

ప్యాపిలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్యాపిలి బీసీ కాలనీకి చెందిన వెంకటేశ్(50) రైతు మృతి చెందాడు. రెండు రోజుల క్రితం వెంకటేశ్ మరో వ్యక్తి సూరితో కలసి బొలేరో వాహనంలో మామిడికాయలను హైదరాబాద్ మార్కెట్‌కు తీసుకెళ్లారు. తిరిగి ప్యాపిలికి వస్తుండగా మార్గమధ్యంలోని ఓఆర్‌ఆర్‌పై ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొంది. ఈ ఘటనలో వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

శిరివెళ్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు, ప్రజలు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని శిరివెళ్ల తపాలాశాఖ పోస్టుమాస్టర్ గణేష్ అన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం ప్రారంభ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయానికి వచ్చి సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకుగాను పిల్లలకు రూ.50, పెద్దలకు రూ.100 ప్రవేశ రుసుము మాత్రమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో లైబ్రెరియన్ సుజాత, విశ్రాంత హెచ్‌ఎం రామకృష్ణ, పోస్ట్‌మాన్ ఖాజాహుసేన్, పాఠకులు, చిన్నారులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని గ్రంథాలయంలో సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించినట్లు ఇన్‌చార్జి గ్రంథాలయ అధికారి బాలతిమ్మారెడ్డి తెలిపారు. శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠకులు ఓబయ్య, రమేశ్, బేల్‌తాజర్, రజియా పాల్గొన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు గ్రంథాలయాధికారి బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు శ్రీరాములు, నందవరం గణిత ఉపాధ్యాయులు ఏవీఎస్ గోవిందయ్య పలు విషయాలను విద్యార్థులకు బోధించారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలో గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థుల కోసం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి రామచంద్రుడు తెలిపారు. సోమవారం ప్రాథమిక పాఠశాలలో విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కథలు చెప్పడం, పుస్తకాలను చదివించడం, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్, చెస్, క్యారమ్స్, క్విజ్ తదితర నైపుణ్యాలపై శిక్షణ ఉంటుందన్నారు. జూన్ 6వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను శిబిరానికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాద్, కాంతారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుద్రవరం: స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు గ్రంథాలయ అసిస్టెంట్ సౌరెడ్డి సోమవారం తెలిపారు. పిల్లలను శిక్షణాశిబిరానికి పంపాలని ఆయన కోరారు.

సంజామల: సంజామల గ్రంథాలయంలో శాఖ అధికారి బాల తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక పాఠకులు హరినాథ రెడ్డి, రాముడు, మధు, సురేంద్ర, అఖిల్, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల : పట్టణంలో గ్రంథాలయ శాఖ వారోత్సవాలు సోమవారం నుంచి జూన్ 6 వరకు వేసవి శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి మధుశేఖర్ సోమవారం తెలిపారు. ఈ వేసవి శిక్షణా తరగతులో భాగంగా గ్రంథాలయ పితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు వేసవి శిక్షనా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల డ్రాయింగ్ మాస్టర్, జాకీర్ హుశేన్, స్పోకెన్ ఇంగ్లీషు ఉపాధ్యాయురాలు కృష్ణప్రియ, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శిరివెళ్ల గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో చిన్నారులు

కస్బా పాఠశాలలో డిజిటల్ తరగతులు

బనగానపల్లె, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కస్బా ప్రాథమిక పాఠశాలలో సోమవారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యప్రకాశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి డిజిటల్ తరగతులు సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతిరోజు ఉదయం 8.30 గంటల నుంచి ఈ డిజిటల్ తరగతులు నిర్వహిస్తామన్నారు. వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం తదితర కార్యక్రమాల ద్వారా విద్యార్థులను చైతన్యం పరుస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుంకన్న, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

బనగానపల్లె, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు రవికిశోర్ సోమవారం తెలిపారు. బనగానపల్లె ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులు తమ సమస్యలను 9959225802 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక



ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

చాగలమర్రి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలస్థాయి అధికారుల ఆధ్వర్యంలో ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఏవో రంగనేతాజీ, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, ఏఈలు కొండారెడ్డి, రమణయ్య, నరసింహరావు, ఏపీఎం నాగమ్మ, సూపర్‌వైజర్ సుశీల పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కరించాలి

చాగలమర్రి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామం లోని కూలూరు రహదారిలో గృహాల ముందు ప్రవహిస్తున్న మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఈవో తాహిర్‌హుసేన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈవో స్పందించి మురుగు నీరు పోయేలా చర్యలు తీసుకుంటామని, కాలువ నిర్మాణ పనులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి

చాగలమర్రి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు కృషి చేయాలని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల సూచించారు. సోమవారం వారు మాట్లాడుతూ 649 మంది విద్యార్థులు డ్రాపౌట్స్‌గా ఉన్నారని, సీఆర్పీలు, కస్తూర్బా సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరి

చాగలమర్రి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో గల రైతులు తమ పొలాల్లో మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో రంగనేతాజీ సూచించారు. సోమవారం వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 690 మట్టి నమూనాలు సేకరించనున్నట్లు తెలిపారు. మట్టినమూనా పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని సూచించారు. జొన్న కొనుగోలుకు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈవో మంజుల పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఇమ్రాన్ సూచించారు. సోమవారం మండలంలోని కొత్తపల్లె గ్రామంలో 104 సేవలు కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వడదెబ్బకు గురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి నుంచి మంజూరు అయిన చెక్కులను బాధితులకు అందజేశారు. సోమ వారం ఆళ్లగడ్డ టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు భార్గవ్ రామ్ నాయుడు బాధితులు చింతకుంట గ్రామానికి చెందిన మిద్దె ఇస్మాయిల్ రూ. 1.40లక్షలు, బాచేపల్లె గ్రామానికి చెందిన దేవమ్మకు రూ. 2.75లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే అఖిలప్రియకు కృతజ్ఞతలు తెలిపారు.

నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి

డోన్ రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అనుమతులు తీసుకోని చర్చి నిర్మాణం చేపట్టాలని ఈవోఆర్‌డీ ఫక్రుద్దీన్ సూచించారు. వెంకటనాయునిపల్లె ప్రధాన రోడ్డు సమీపంలో అనధికారికంగా చర్చిని నిర్మిస్తున్నారని స్థానిక నివాసి మాణిక్యాల కేశవులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో సోమవారం ఈవోఆర్‌డీ ఫక్రుద్దీన్ చర్చి నిర్మాణాన్ని పరిశీలించారు. అనుమతులు తీసుకునే వరకు పనులు నిలిపివేయాలని ఆయన సూచించారు.

విద్యుత్ శాఖ ఏఈ బదిలీ

రుద్రవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం విద్యుత్ శాఖ ఏఈ సునీల్‌కుమార్ బదిలీ అయినట్లు ఉన్నతాధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుద్రవరం నుంచి నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఇక్కడ సబ్ ఇంజనీరు రాజశేఖర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

రుద్రవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంపీడీవో భాగ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 10 వరకు దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాలతో అప్రమత్తం

రుద్రవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అటవిలో అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని రేంజర్ శ్రీపతినాయుడు సూచించారు. సోమవారం రుద్రవరం ఫారెస్టు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సుమారు రేంజ్ పరిధిలో 250 ఫైర్ పా యింట్లు గుర్తించామన్నారు. ఎప్పటికప్పుడు అగ్ని ప్రమాదాలను నివారిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. అటవికి నిప్పు మానవాళికి ముప్పు అన్నారు. అడవులను సంరక్షించే బాధ్యత అందరిపై ఉందన్నారు.

'రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం'

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రైతులకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం నాయకులతో సీపీఐ నాయకులు సమావేశం నిర్వహించారు. భూములిచ్చిన రైతులపై సిమెంట్ కంపెనీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, రైతు సంఘం నాయకులు సోమన్న, స్థానిక నాయకులు సూరి, మహేష్, రైతులు కామిని ప్రతాపరెడ్డి, పుల్లయ్య, శ్రీకాంతరెడ్డి, చంటి, నాగేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.